విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక






సంపుటి: 16 | సంచిక : 81 | గురువారం 16. 7. 2026 | ఎడిటర్‌: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00




# ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌ది కీలక పాత్ర

## తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు
- ఎట్టుబడులపై ప్రతి నెలా సమీక్ష
- ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన
- అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం.
- ఇక్కడ మరిన్ని పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం.
- దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది మా లక్ష్యం.
- 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ
- దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారబోతున్నాం.
- పరిశ్రమలు, టూరిజం, క్రీడా నైపుణ్యం, వైద్య రంగాల్లో పాలసీలు తెచ్చాం.

## జీవితాల్లో మార్పు తెచ్చేది చదువొక్కటే.

కుటుంబాలలో ఆనందం నింపేది, మనుషుల జీవితాలను మార్చేది కేవలం చదువొక్కటేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో నూతనంగా నిర్మించిన బాలికల హైస్కూల్‌ను మంత్రులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహి రంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థ పునర్నిర్మాణంపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్య ప్రాధాన్యతను గుర్తించే తాను విద్యా శాఖను తన వద్దే ఉంచుకున్నానని సీఎం తెలిపారు. గత పదేళ్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ బడుల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఒకే కుటుంబం కీలక శాఖలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటు వెనుక విద్యార్థుల ఉద్యమాలు, ఆత్మబలిదానాలు ఉన్నాయని.. రాజకీయ నాయకుల వల్ల కాకుండా విద్యార్థుల వల్లే తెలంగాణకు చట్టబద్ధత వచ్చిందని గుర్తుచేశారు. వారి త్యాగాలకు ప్రతిరూపంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేయడమే తన ఆకాంక్ష అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు పూర్తి స్థాయి అర్హతలు, అనుభవం ఉన్నాయని.. అదే ప్రైవేట్ స్కూళ్లలో ఉపాధ్యాయులకు సగం అర్హతలు కూడా ఉండవని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్లే విద్యార్థులు ప్రైవేట్ బడుల వైపు వెళ్లాల్సి వచ్చిందని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతామని, మార్పు అనేది రాత్రికి రాత్రి రాకపోయినా ఒక మంచి అడుగైతే ముందుకు పడాల్సిందేనని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ముందుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల సమస్యలన్నింటినీ పరిష్కరించామని రేవంత్ రెడ్డి తెలిపారు.

# ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఏపీ ప్రభుత్వం చర్యలు

## బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్



దిల్లీ: ఏపీ ప్రభుత్వ పనితీరును బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ కొనియాడారు. దిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో అక్కడి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఇరాన్‌పై పగటిపూట దాడులు..



పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధం తలెత్తే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే అమెరికా -ఇరాన్ మధ్య దాడులు నానాటికీ తీవ్రమవుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు.. ఈ ఉద్రిక్తతలను మరింత పెంచేలా ఉన్నాయి. శాంతి చర్చలకు టెహ్రాన్ సహకరించకపోతే.. వచ్చేవారం నుంచి సైనిక దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. తాజాగా సిచువేషన్ రూమ్‌లో ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ ప్రకటన వెలువడిన కాసేపటికే.. ఇరాన్‌పై అమెరికా మరో దఫా దాడులు ప్రారంభించింది. ఈ మేరకు యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అయితే, ఇటీవలి కాలంలో ఎక్కువగా రాత్రివేళల్లోనే దాడులు చేసిన అగ్రరాజ్యం.. ఈసారి పగటిపూటే విరుచుకుపడటం గమనార్హం. హర్మూజ్ జలసంధి, ఇరాన్ తీర ప్రాంతాల్లోని టెహ్రాన్ సైనిక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా డ్రోన్లతో దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఇరాన్ రక్షణ, క్షిపణి స్థావరాలను లక్ష్యంగా చేసుకుని గ్రేటర్ తున్బ్ ద్వీపంపై దాడి చేసినట్లు తెలిపింది. హర్మూజ్‌లో నౌకలపై ఇరాన్ దాడులు చేయకుండా ఆ దేశ సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడమే తమ లక్ష్యమని అగ్రరాజ్యం వెల్లడించింది.

# తెలంగాణలోనూ 'సర్' గడువు పొడిగింపు




హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) పొడిగించింది. ఆగస్ట్ 3 వరకు ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించనున్నట్లు తెలిపింది. ఆగస్ట్ 10న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన, ఆగస్ట్ 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ చేపట్ట నుంది. అభ్యంతరాలపై విచారణకు అక్టో బర్ 8 వరకు ఈసీఐ తుదిగడువు విధించింది. ఇప్పటికే ఏపీలో సర్ గడువును ఈనెల 24 వరకు పొడిగించిన సంగతి తెలిసిందే.



# మరింత పటిష్టంగా అమలు చేయండి

- పోక్సో చట్టంపై రేవంత్ రెడ్డికి పవన్ లేఖ

పోక్సో చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరారు. ఈ మేరకు లేఖ రాసిన ఆయన పోక్సో కేసులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చిన్నారుల భద్రత రాజ్యాంగ బాధ్యత అని చెప్పిన పవన్.. ఆర్టికల్ 21, 39 ప్రకారం పిల్లల హక్కులను కాపాడాలని చెప్పారు. పోక్సో కేసుల్లో తక్షణ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సూచించారు.

# క్యాంపస్‌లో డ్రగ్స్ కనిపిస్తే కాలేజీ గుర్తింపు రద్దు

- రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ మాస్ వార్నింగ్
- తెలంగాణ పోలీసు శాఖ కఠిన చర్యలకు శ్రీకారం
- ఇకపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని పక్కాగా అమలు
- ఈగల్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో సమావేశం
- ప్రతి క్యాంపస్‌లో ప్రత్యేక నిఘా కమిటీలు..
- విద్యార్థులు కాలేజీల్లో చేరే సమయంలోనే డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలి
- భవిష్యత్తు పౌరులను తీర్చిదిద్దే విద్యా సంస్థల్లో డ్రగ్స్‌కు ఏమాత్రం చోటు లేదు




# 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

- ఆ క్రెడిట్ తీసుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారు
- '2011లో రైట్స్ కంపెనీ దేశంలో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు సాధ్యాసాధ్యాలపై చేసిన అధ్యయనం
- మోదీ ప్రభుత్వం వచ్చాక ఉడాన్ స్కీంతో ఎయిర్ పోర్టుల పెంపునకు శ్రీకారం
- కొత్తగా 88 ఎయిర్‌పోర్టులకు ఆమోదం తెలిపింది.
- భూసేకరణ పూర్తికాకపోవడం వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణం ఇంత ఆలస్యం
- ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు రాబోతోంది'





# ఏసీబీకి చిక్కిన గ్రౌండ్ వాటర్ ఆఫీసర్, ఆపరేటర్

- రూ.20 వేలు లంచం డిమాండ్.
- సూర్యాపేట జిల్లా భూగర్భ జలాల శాఖ కార్యాలయంలో ఘటన
- బాధితుడు ఏసీబీ నల్గొండ రేంజ్ అధికారులను ఆశ్రయం

# తుంగతుర్తి అంశంలో జోక్యం చేసుకోను

- రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- తుంగతుర్తిలో తాను జోక్యం చేసుకోబోం
- కోమటిరెడ్డితో భేటీ అనంతరం జగ్గారెడ్డి మీడియాతో సమావేశం



హైదరాబాద్: తుంగతుర్తిలో నెలకొన్న వివాదాన్ని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చూసుకుంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో తాను జోక్యం చేసుకోబోనని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని కోమటిరెడ్డి నివాసంలో ఆయనతో జగ్గారెడ్డి భేటీ అయ్యారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవుల విషయంలో నెలకొన్న వివాదంపై చర్చించారు. కోమటిరెడ్డితో భేటీ అనంతరం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. తుంగతుర్తి అంశంలో కలగజేసుకునేందుకు కోమటిరెడ్డి ఆసక్తి చూపించడం లేదన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావాలంటే వరుసగా మూడేళ్లు పార్టీ కార్యకర్తగా కొనసాగాలనే ఏఐసీసీ నిబంధన ఉందన్నారు.

# సంపాదకీయం

## కారడవులను కాపుగాసే ఏఐ...

దేశంలో ఎనిమిది కోట్లకు పైగా హెక్టార్లలో అడవులు విస్తరించాయి. జీవ వైవిధ్యానికి నిలయాలైన అరణ్యాలు... కర్బన నిల్వలు, వాతావరణ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. విస్తీర్ణం, సాంద్రత తగ్గుదల, వనరుల దుర్వినియోగం, అగ్నిప్రమాదాలు, వాతావరణ మార్పులు వంటి తీవ్ర సవాళ్లను అడవులు ఎదుర్కొంటున్నాయి. సంప్రదాయ అటవీ నిర్వహణ పద్ధతులతో వీటిని అధిగమించడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో అటవీ సంరక్షణ, సమర్థ నిర్వహణలో కృత్రిమ మేధ (ఏఐ) ఆశాకిరణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ వినియోగం విస్తృతమవుతోంది. అటవీశాఖ పనితీరును మెరుగు పరచడంలోనూ ఇది బహుళ ప్రయోజనకారిగా పనిచేసే అవకాశం ఉంది. అటవీశాఖ దగ్గర దశాబ్దాల సమాచారం ఉంది. ఏఐతో దీన్ని విశ్లేషించడం ద్వారా వన్యప్రాణులు తరచూ సంచరించే ప్రదేశాలను ముందుగానే గుర్తించవచ్చు. టేకు, ఎర్రచందనం వంటి కలపనిచ్చే వృక్ష జాతులు విస్తరించిన ప్రాంతాల్లో ఏఐతో గట్టి నిఘా పెట్టడం, చెట్లు నరికే వ్యక్తులనూ సమూహాలను గుర్తించడం, మనుషులకు వన్యప్రాణులకు మధ్య జరిగే సంఘర్షణ ప్రదేశాలను గమనించడం, వాటిని నివారించడానికి తగిన చర్యలను తీసుకోవడం సాధ్యమవుతుంది. విస్తారమైన డేటాను విశ్లేషించడం, అంచనా నివేదికలను రూపొందించడం వంటి సామర్థ్యాలు కలిగిన ఏఐ- అడవుల నిర్వహణ, సంరక్షణలో ఆధునిక సాంకేతికత సాయాన్ని పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. అటవీ పర్యవేక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, వనరుల అక్రమ వినియోగాన్ని అరికట్టడం, వాతావరణ మార్పులను ముందుగానే గుర్తించడం, వాటిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం తదితర అంశాల్లోనూ ఏఐ వాడకం వేగంగా విస్తరిస్తోంది.

**తక్షణ హెచ్చరికలకు...**

అనేక ప్రాంతాల్లో విస్తరించిన అరణ్యాల్లో ఎక్కడో కొన్ని ప్రదేశాల్లో అటవీ ప్రాంతాల ఆక్రమణ, వనరుల దోపిడీ వంటివి జరుగుతూనే ఉంటాయి. అటువంటి ప్రదేశాలను కాలినడకన గస్తీ తిరిగే సిబ్బంది గుర్తించడంలో ఆలస్యం జరగవచ్చు. డ్రోన్లు, ఏఐ ఆధారిత పరికరాల ద్వారా వాటిని గుర్తించి, తక్షణమే సిబ్బంది అక్కడికి చేరుకుని నష్టాన్ని అరికట్టవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భూఆధారిత సమాచార వ్యవస్థ (జీఐఎస్) ఉపగ్రహ చిత్రాలను ఉ పయోగిస్తూ అటవీ ప్రాంతాల్లో సంభవించే మార్పులను తరచూ అధ్యయనం చేస్తూ, వాటికిగల కారణాలను విశ్లేషించి, అటవీ నిర్వహణ తీరును మెరుగుపరిచే కృషి జరుగుతోంది. నాగార్జున సాగర్, అమ్రాబాద్, కవ్వాల్ వంటి పులుల సంరక్షణ కేంద్రాల్లో పులుల కదలికలు, పర్యవేక్షణకు ఏం-స్ట్రైప్స్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. అగ్నిప్రమాదాలకు సంబంధించిన చారిత్రక డేటా, వాతావరణ పరిస్థితుల ఆధారంగా ప్రమాదం సంభవించడానికి అవకాశం ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించవచ్చు. ఈ క్రమంలో ఏఐ ఆధారిత పరికరాలు తక్షణ హెచ్చరికలను అందిస్తూ అగ్నిమాపక సిబ్బందికి సహాయ పడుతున్నాయి. దీనివల్ల విపత్తువేళ స్పందన సమయం 20-40శాతం తగ్గినట్లు వెల్లడైంది. శబ్ద పర్యవేక్షణ ద్వారా పక్షుల కిలకిలలు, పులుల గర్జనలు వంటి వాటిని ఏఐ సాంకేతికత విశ్లేషిస్తోంది. వివిధ జీవజాతులను గుర్తిస్తోంది. కెమెరా ట్రాప్స్ ద్వారా సేకరించిన లక్షల సంఖ్యలోని చిత్రాలను ఏఐ వర్గీకరిస్తూ మానవ శ్రమను తగ్గిస్తోంది. అస్సాం, కేరళలో ఏనుగుల విషయంలో వినియోగించిన ఏఐ ఆధారిత సాంకేతిక ఉపకరణాలు మానవ-జంతు ఘర్షణలను తగ్గించాయి.

**వేటగాళ్లపై నిఘాకు...**

అటవీ పరిరక్షణ, నిర్వహణలో ఏఐ సాంకేతికతను వాడే విషయంలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. స్థానిక జాతులు, నేల నాణ్యత, వన్యప్రాణుల కదలికలపై డేటా లభ్యత తక్కువగా ఉంటోంది. మౌలిక వసతుల లోపం, ఇంటర్నెట్, విద్యుత్ సౌకర్యం లేని ప్రాంతాల్లో ఏఐ ఉ ప్రకరణాలను వినియోగించడం కష్టమవుతుంది. ఏఐ పరికరాలు ఖరీదైనవి, పైగా సిబ్బంది శిక్షణకు అధిక వ్యయం అవుతుంది. ఇలాంటి సమస్యలను అధిగమించాల్సిన అవసరం ఉంది. ఏఐ ద్వారా నేల ఆరోగ్యం, కార్బన్ స్థాయులు, వేటగాళ్ల కార్యకలాపాలను పర్యవేక్షించే స్మార్ట్ సెన్సర్లను అభివృద్ధి చేసుకోవాలి. జాతీయ హరిత మిషన్ కింద ఏఐ వినియోగానికి విధానపరమైన ప్రోత్సాహం అందించాలి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం, గ్రామస్థులు, విద్యార్థులు మొబైల్ యాప్ల ద్వారా అక్రమ కార్యకలాపాలను ప్రభుత్వానికి నివేదించడం వంటి పనులు చేపట్టవచ్చు. అటవీ సంరక్షణలో సమర్థ పర్యవేక్షణ, తక్షణ చర్యలు మొదలు అంచనా, విశ్లేషణల దాకా ఏఐ కీలకపాత్ర పోషిస్తుంది. రాబోయే కాలంలో సవాళ్లను మరింత సమర్థంగా అధిగమిస్తూ అందరి సహకారంతో ముందుకు సాగితే ఏఐ ఆధారిత అటవీ నిర్వహణలో భారత్ ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ క్రమంలో క్షేత్రస్థా యిలో అటవీ విభాగాలను ఆధునికీకరించడం, కొత్త సాంకేతి కతను, పరికరాలను, మెలకువలను సమకూర్చడం అవసరం.

## పోలీస్ కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన సీపీ



**హనుమకొండ జులై1 5 (తెలంగాణ వాణి)**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత,బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ కంట్రోల్ రూం మరి యు కమాండ్ కంట్రోల్ సెంటర్ను సంబంధిత అధికా రులతో కలిసి పరిశీలిం చారు.ఈ సందర్భంగా కంట్రోల్ రూం సిబ్బంది పనితీరు, అత్యవసర కాల్స్ స్వీకరణ విధానం,సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ,నగరంలోని వివిధ ప్రాంతాలపై నిఘా, అలాగే సాంకేతిక వ్యవస్థల పనితీరును కమిషనర్ సమీక్షించారు.ప్రజలకు అత్యవసర సేవలు మరింత వేగంగా అందేలా కంట్రోల్ రూం సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు .అదేవిధంగా, కమాండ్ కంట్రోల్ సెంటర్లో అందుబాటులో ఉన్న ఆధు నిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియో గించి నేరాల నియంత్రణ, ట్రాఫిక్ పర్యవేక్షణ,శాంతి భద్రతల నిర్వహ ణలో మ రింత సమన్వయంతో పనిచేయాలని అధికారు లను ఆదేశించారు. ఈ పరిశీలనలో పోలీస్ కమిషనర్ వెంట అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్,ఏసీపీ జితేందర్ రెడ్డి,ఆర్ఐ సతీష్,క్లూస్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, ఎస్ఐ రోహిత్,ఆర్ఎస్ఐ శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఆడబిడ్డ సూసైడ్ చేసుకున్నా పట్టించుకోవటం లేదు: కవిత

పెద్ద రైస్ మిల్లర్లతో ప్రభుత్వం, ప్రతిపక్షాలు కుమ్మక్కయ్యాయని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం కవితతో రైస్ మీల్లర్లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో వందల కోట్లతో వ్యాపారం చేసే బాయిల్డ్ రైస్ మిల్లర్ల జోలికి ఈ ప్రభుత్వం వెళ్లటం లేదని.. వాళ్ల నుంచి దాదాపు రూ.4 వేల కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉన్నా ఏమీ అనటం లేదని అన్నారు. కానీ, 10 లక్షల నుంచి కోటి రూపాయల వరకు బకాయిలు ఉన్న చిన్న రైస్ మిల్లర్లను దొంగలను చూసినట్లు చూస్తున్నారని ఆరోపించారు. వారిపై ఎంక్వైరీ అంటూ కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారన్నారు. ఈ బాధ తట్టుకోలేక కరీంనగర్‌లో ఒక ఆడబిడ్డ సూసైడ్ చేసుకున్నదని తెలిపారు.అయినా.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టించుకోవటం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం దిగిపోయే సమయంలో లక్షా 40 వేల టన్నుల దొడ్డు బియ్యం ఉండేవని.. ఫిలిప్పీన్స్‌కు ఆ ప్రభుత్వం కిలో రూ.48 చొప్పున అమ్మిందన్నారు. కానీ.. ఈ ప్రభుత్వం ఇప్పుడు రూ.24కు అని టెండర్ పెట్టిందని.. కొన్ని రోజులకే మళ్లీ రూ.21.70కే దాన్ని అమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దానికి సంబంధించి కరీంనగర్ కు చెందిన ఒక రైస్ మిల్లర్‌కు టెండర్ అప్పగించారని చెప్పారు. ఈ బియ్యానికి సంబంధించి కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నదన్నారు. పెద్ద రైస్ మిల్లర్లతో కేటీఆర్, హరీశ్‌రావు కుమ్మక్కై మాట్లాడటం లేదన్నారు. తాము చిన్న రైస్ మిల్లర్ల తరఫునే మాట్లాడతామని, వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# జీవితాల్లో మార్పు తెచ్చేది చదువొక్కటే..

**ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**వనపర్తి : జూలై 15, (తెలంగాణ వాణి ప్రతినిధి)**

వనపర్తి జిల్లా కొత్తకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవానికి బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు పూర్తి స్థాయి అర్హతలు, అనుభవం ఉన్నాయని అదే ప్రైవేట్ స్కూళ్లలో ఉపాధ్యాయులకు సగం అర్హతలు కూడా ఉండవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.కుటుంబాలలో ఆనందం నింపేది,మనుషుల జీవితాలను మార్చేది కేవలం చదువొక్కటేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో నూతనంగా నిర్మించిన బాలికల హైస్కూల్ను మంత్రులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థ పునర్నిర్మాణంపై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విద్య ప్రాధాన్యతను గుర్తించే తాను విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని సీఎం తెలిపారు. గత పదేళ్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ బడుల్లో కనీస సదుపాయాలు కరువయ్యాయని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఒకే కుటుంబం కీలక శాఖలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకుందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటు వెనుక విద్యార్థుల ఉద్యమాలు, ఆత్మ బలిదానాలు ఉన్నాయని. రాజకీయ నాయకుల వల్ల కాకుండా విద్యార్థుల వల్లే తెలంగాణకు చట్టబద్ధత వచ్చిందని గుర్తుచేశారు. వారి త్యాగాలకు ప్రతిరూపంగా రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టంచేయడమే తన ఆకాంక్ష అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు పూర్తి స్థాయి అర్హతలు, అనుభవం ఉన్నాయని..





అదే ప్రైవేట్ స్కూళ్లలో ఉపాధ్యాయులకు సగం అర్హతలు కూడా ఉండవని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి వల్లే విద్యార్థులు ప్రైవేట్ బడుల వైపు వెళ్లాల్సి వచ్చిందని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతామని, మార్పు అనేది రాత్రికి రాత్రి రాకపోయినా ఒక మంచి అడుగైతే ముందుకు పడాల్సిందేనని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ముందుగా పెండింగ్లో ఉన్న టీచర్ల సమస్యలన్నింటినీ పరిష్కరించామని రేవంత్ రెడ్డి తెలిపారు.ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తున్నారని ప్రభుత్వం కూడా విద్యపై ఏడాదికి రూ.30 కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల గతంలో దేశంలో తెలంగాణ పాఠశాలలు 35వ స్థానంలో ఉండేవని, తమ ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఇప్పుడు ఆ స్థానాన్ని 18వ ర్యాంకుకు తీసుకు రాగలిగామని సీఎం వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో వైట్ కాలర్ ఉద్యోగాలు తగ్గి పోతున్నాయని అందుకే తమ ప్రభుత్వం సాంకేతిక నైపుణ్యాలతో



కూడిన బ్లూ కాలర్ ఉద్యోగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిందని సీఎం పేర్కొన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీఐ కేంద్రాలను త్వరలోనే అత్యాధునికంగా తీర్చిదిద్దనున్నట్లుగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణికి పూర్వ వైభవం పూర్తిస్థాయిలో వచ్చినట్లే

- భరోసా యాత్ర ఘనవిజయం
- ఎస్.సి.ఎంకెఎస్- బిఎంఎస్ పై మరింత బాధ్యత
- కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో పాటు విచ్చేసిన నాయకులందరికీ ధన్యవాదాలు
- సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ నేత మాధవ నాయక్



**కొత్తగూడెం సింగరేణి, జూలై 15 (తెలంగాణ వాణి)**

సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల ఉద్యోగ భద్రత, సంక్షేమం, సంస్థ భవిష్యత్ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన "సింగరేణి భరోసా యాత్ర" ఘనవిజయం సాధించడం పట్ల బిఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ హర్షం వ్యక్తంచేస్తోంది. ఈ భరోసా యాత్రకు నాయకత్వం వహించిన కేంద్ర బొగ్గు అండ్ గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. బిఎంఎస్ యూనియన్ అభ్యర్థుల మేరకు తాడిచెర్ల--×× బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడంతో సంస్థ ఎంతగానో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తోందని ఏబికేఎంఎస్ జాతీయ కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యులు ఈ మాధవ్ నాయక్ పేర్కొన్నారు. అంతేగాక నైని బొగ్గు గనిలో ఉత్పత్తి ప్రారంభానికి అవసరమైన అనుమతులు కల్పించడం, అలాగే వీకే ఓసి , గోలేటి ఓసి , పూసపల్లి ఓసి తదితర ప్రాజెక్టులకు సాంకేతిక అనుమతులు త్వరితగతిన మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టడం సింగరేణి అభివృద్ధికి బలమైన పునాది వేశాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, తెలంగాణ ప్రభుత్వ సంస్థలైన జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సింగరేణికి రావలసిన సుమారు రు.54,000 కోట్ల బకాయిల అంశాన్ని దేశ ప్రజల దృష్టికి తీసుకెళ్లి, సింగరేణి ఆర్థిక పరిస్థితులపై స్పష్టత కల్పిస్తూ కార్మికులకు భరోసా, విశ్వాసం కల్పించిన కేంద్ర మంత్రి కృషి అభినందనీయమని వివరించారు.ఈ సందర్భంగా భరోసా యాత్రలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి , పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ , డి.కె. అరుణ , ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు యాత్ర విజయ వంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సింగరేణి కార్మికులు, అధికారులు, ప్రాంత ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే, భరోసా యాత్రను విజయవంతం చేసిన వేలాది మంది సింగరేణి కార్మికులు, అధికారులు, కార్మిక కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు అభిమానులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. భరోసా యాత్ర విజయంతో ఎస్ సి ఎంకేఎస్, బి.ఎం.ఎస్ పై మరింత బాధ్యత పెరిగిందిని పేర్కొన్నారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, సంస్థ అభివృద్ధి కోసం గతంలోలాగే మరింత చిత్తశుద్ధితో, పట్టుదలతో ఉద్యమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడలు

- క్రీడా పోటీల్లో సత్తా చాటిన కరీంనగర్ పోలీస్ కమిషనరేట్
- మొత్తం 11 పతకాలతో జోన్-3లో అగ్రస్థానంలో నిలిచిన కరీంనగర్ కమిషనరేట్

**కరీంనగర్, జులై 15 (తెలంగాణ వాణి ప్రతినిది)**

5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడలు ఢ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులు,సిబ్బం ది అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొత్తం 11 పత కాలు సాధించి జోన్-3లో అగ్రస్థానాన్ని దక్కించుకు న్నారు.ఈ పోటీల్లో కరీంనగర్ కమిషనరేట్ తరఫున పాల్గొన్న క్రీడాకారులు 2 స్వర్ణ,4 రజత,5 కాంస్య పతకాలు సాధించి కమిష నరేట్‌కు గౌరవాన్ని తీసుకు వచ్చారు.పతక విజేతల వివరాలు పీసీ పి.రాజు (+.చీశీ. 3106) 90 కిలోల బాడీ బిల్డింగ్ విభాగంలో స్వర్ణ పతకం.ఏఆర్‌పీసీ ఎస్. నరేందర్ (+.చీశీ.296) -- 85 కిలోల బాడీ బిల్డింగ్‌లో రజత పతకం.పీసీ ఎం.డి. వహాజుద్దీన్ (+.చీశీ.3940) 80 కిలోల బాడీ బిల్డింగ్‌లో రజత పతకం.ఏఆర్‌పీసీ ఎ.శంకర్ (+.చీశీ.984) -- యోగా విభాగంలో స్వర్ణ పతకం.ఏఆర్‌పీసీ వి.సాయి మాధవ్



(+.చీశీ.3687) -- ఆర్మ్ రెజ్లింగ్‌లో రజత పతకం,55 కిలోల బాక్సింగ్ లో కాంస్య పతకం.పీసీ జె శ్రీనివాస్ (+.చీశీ.1658) -- 81 కిలోల జూడోలో కాంస్య పతకం.డబ్ల్యూపీసీ ఎ. స్వప్న (+.చీశీ.3088) -- 65 కిలోల ఆర్మ్ రెజ్లింగ్‌లో రజత పతకం.డబ్ల్యూపీసీ ఎం.అరుణ (+.చీశీ.47) -- 77 కిలోల బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్,పవర్ లిఫ్టింగ్ విభాగాల్లో మూడు కాంస్య పతకాలు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు.జోన్-3 పతకాల పట్టికకరీంనగర్ పోలీస్ కమిషన రేట్ --2 స్వర్ణ, 4 రజత,5 కాంస్య (మొత్తం 11)సిద్ధిపేట కమిషనరేట్ -- 5 పతకాలు.రాజన్న సిరిసిల్ల -- 3 పతకాలు.కామారెడ్డి -- 2 పతకాలు.మెదక్ -- 2 పతకాలు ఈ విజయంతో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ జోన్-3లో అత్యధిక పతకాలు సాధించిన యూనిట్‌గా నిలిచింది.ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం,పతక విజేత లను అభినందిస్తూ,విధి నిర్వహణతో పాటు క్రీడల్లో నూ రాణించడం ప్రతి పోలీ సు సిబ్బందికి ఆదర్శమని పేర్కొన్నారు.క్రమశిక్షణ, శారీరక దృఢత్వం,నిరంతర సాధనతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని కొని యాడారు.భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర,జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కమిషనరేట్‌కు మరింత పేరు ప్రతిష్టలు తీసుకురా వాలని ఆకాంక్షించారు.క్రీడా స్ఫూర్తిని పెంపొం దించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తోందని, పోలీసు సిబ్బంది ఆరోగ్యవం తంగా,ఫిట్‌గా ఉండేందుకు ఇటువంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని ఆయన తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

- హక్కుల సాధనకు టీయూడబ్ల్యూజే నిరంతర పోరాటం
- వేములవాడలో టీయూ డబ్ల్యూజే హెచ్-143 సభ్య త్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం

**వేములవాడ:జులై 15 (తెలంగాణ వాణి)**

జర్నలిస్టుల సంక్షే మం,వృత్తి హక్కుల పరిర క్షణ,సమస్యల పరిష్కారమే తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్- 143) ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ఉపాధ్యక్షుడు,జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా అన్నారు.వేములవాడ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహిం చిన టీయూడబ్ల్యూజే హెచ్-143 సభ్యత్వ నమో దు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలి పాక నరసయ్య,ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం కొన సాగింది.ఈ సందర్భంగా లాయక్ పాషా మాట్లాడు తూ,జర్నలిస్టుల వృత్తి గౌరవాన్ని కాపాడటంతో పాటు వారి సంక్షేమం కోసం టీయూడబ్ల్యూజే నిరంతరం పోరాడుతున్న సంఘమని పేర్కొన్నారు.సంఘం బలో పేతానికి ప్రతి జర్నలిస్టు సభ్యత్వం తీసుకుని సంఘ టిత శక్తిని పెంచాలని పిలు పునిచ్చారు.రాష్ట్ర అధ్య క్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి



మారుతి సాగర్ నాయకత్వంలో టీయూడబ్ల్యూజే జర్నలి స్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అనేక సంక్షే మ కార్యక్రమాలు అమలు చేయించిందని ఆయన గుర్తు చేశారు.జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో ఈ సంఘం ఎప్పుడూ ముం దుంటుందని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు,ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం వద్ద బలంగా వాదించి సాధించే దిశగా సంఘం కృషి చేస్తుందని లాయక్ పాషా భరోసా వ్యక్తం చేశారు.జర్నలిస్టుల సమస్యలపై ఐక్యంగా పోరాడితేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవు తాయని ఆయన అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్ర మంలో పాల్గొన్న పలువురు జర్నలిస్టులు మాట్లాడు తూ,వృత్తి పరమైన సవాళ్లు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సంఘటిత శక్తి అవసరం మరింత పెరిగింద న్నారు.సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా జర్నలి స్టుల్లో ఐక్యత పెంపొందడం తో పాటు వారి హక్కుల సాధనకు మరింత బలం చేకూరుతుందని అభిప్రాయ పడ్డారు.కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గం సభ్యులు పాల్గొని సభ్యత్వ నమోదు చేయించుకున్నారు.ఈ కార్యక్రమం జర్నలిస్టుల సంక్షేమం,హక్కుల సాధన కు సంఘం మరింత చురుకుగా పనిచేయనున్నదనే సంకేతాలను ఇచ్చిందని పాల్గొన్న వారు పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ కార్యవర్గం,సభ్యులు పాల్గొన్నారు.

## హోతి-కే గురుకులంలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష



**జహీరాబాద్, జూలై 15 (తెలంగాణ వాణి)**
జహీరాబాద్‌లోని హోతి-కే టీజీఆర్ఈఎస్ (TGRES) గురుకుల పాఠశాల, జూనియర్ కళా శాలలో 6, 7, 8వ తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి ఈ నెల 17న ప్రవేశ పరీక్ష నిర్వహించ నున్నట్లు ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జూలై 16లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు హోతి-కే గురుకుల పాఠశాలలో నిర్వహిస్తారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలి. మొత్తం 32 ఖాళీ సీట్లు ఉన్నాయి. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు అసలు ఆధార్ కార్డుతో పాటు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో తప్పనిసరిగా తీసుకురావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## క్రీడాకారిని నారీమల్ల ప్రవళికకు ఘన స్వాగతం





**డిండి జులై 15( తెలంగాణ వాణి ప్రతినిధి )**
చైనాలోని ఆర్డోస్ లో జరిగిన ఆసియా అండర్ -23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో స్వర్ణ పథకం గెలిచిన క్రీడాకారిని నారీమల్ల ప్రవళిక కు డిండిలో ఘన స్వాగతము తో డిండి మండల నాయకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు పూలమాలతో సత్కరించి ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ పరశురామును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల కళాశాలలో జోనల్ ఆఫీసర్, విద్య రాణి ప్రిన్సిపాల్ వై. శిరీష ఆధ్వర్యంలో ప్రవళికను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయనీల బృందం, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి యువతకు ఆదర్శంగా జూలపల్లి యువకుడు.

### 29వ సారి స్వచ్ఛంద రక్తదానం చేసిన గంగిపెల్లి విద్యాసాగర్

**పెద్దపల్లి, జూలై 15 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**




పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు గంగిపెల్లి విద్యాసాగర్ తన పుట్టినరోజు సందర్భంగా మరోసారి మానవతను చాటుతూ 29వ సారి స్వచ్ఛంద రక్తదానం చేశారు. స్థానిక బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసి, రక్తదానం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదాతగా నిలవాలనే సందేశాన్ని సమాజానికి అందించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, “రక్తదానం చేయడం వల్ల దాతకు ఎలాంటి నష్టం ఉండదు. కానీ అవసరమైన సమయంలో ఒకరి ప్రాణాన్ని కాపాడే గొప్ప అవకాశం లభిస్తుంది. ప్రతి ఆరోగ్యవంతమైన యువకుడు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలి” అని పిలుపునిచ్చారు. సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే గంగిపెల్లి విద్యాసాగర్ ఇప్పటివరకు 29 సార్లు రక్తదానం చేయడం పట్ల స్థానిక ప్రజలు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు, యువకులు ఆయనను అభినందించారు. యువతకు ఆయన స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ, సేవాభావానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు.

## క్రికెట్ బాల్ కోసం బావిలోకి దిగి విద్యార్థి మృతి

**పెద్దపల్లి, జూలై 15 (తెలంగాణ వాణి):**



పెద్దపల్లి జిల్లా రామగుండం మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. రామగుండం మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న వెంచల సాత్విక్ (13) క్రికెట్ ఆడుతుండగా బంతి బావిలో పడింది. దానిని తీసుకొచ్చేందుకు బావిలోకి దిగిన సాత్విక్ ఊపిరాడక మృతి చెందినట్లు సమాచారం. మృతుడు రామగుండానికి చెందిన వెంచల మధుకర్ కుమారుడు. ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు, తోటి విద్యార్థులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన నేపథ్యంలో పాఠశాలల పరిసరాల్లో ఉన్న బావులు, ఇతర ప్రమాదకర ప్రాంతాలకు రక్షణ చర్యలు చేపట్టి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## నైపుణ్య దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు.



**కోహెడ:జూలై 15 (తెలంగాణ వాణి విలేకరి)**
యువ ప్రపంచజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా మీరా యువభారత్ సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో “దేశ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర” అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, యువజన అవార్డు గ్రహీత వలస శుభాష్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత నైపుణ్యాలే నవభారత నిర్మాణ పునాదని, ముఖ్యంగా డిజిటల్ నైపుణ్యాలు కృత్రిమ మేధస్సు ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై యువత దృష్టి సారించిందని పేర్కొన్నారు. విద్యార్థుల లక్ష్యంతో చదువుకుని తమ నైపుణ్యాలను దేశాభివృద్ధికి వినియోగించాలని. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ మెదక్ రీజనల్ ఎంప్లాయ్ యూనియన్ మహాసభ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఈదురు వెంకన్న
- మెదక్ డిపో రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన దేవులపల్లి రవీందర్

**మెదక్ జిల్లా జూలై 15:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
బుధవారం రోజున తెలంగాణ ఆర్టీసీ మెదక్ రీజనల్ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ డిపోల నుండి కార్మికులు ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈదురు వెంకన్న మాట్లా డుతూ.... ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగులకు ఏ సమస్య వచ్చిన నాయకులు అందుబాటులో ఉంటారని, బాధ్యతగా వ్యవహరించాలని , కార్మికుల సంక్షేమమే సంఘం ప్రధాన లక్ష్యంగా, హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి



చేస్తామని తెలిపారు .మెదక్ డిపో నుండి కొత్తగా ఎన్నికైన



తెలంగాణ ఆర్టీసీ మెదక్ రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన దేవులపల్లి రవీందర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను ఆర్టీసీ మెదక్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీ మెదక్ కమిటీ కార్మికులు ఉద్యోగులకు మా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాను. ప్రతి కార్మికుడి సమస్యను పెద్దల వద్దకు తీసుకెళ్లి పరిష్కారం చూపేలా కృషి చేస్తానని తెలిపారు.మెదక్ డిపో నుండి పాల్గొన్న కమిటీ అధ్యక్షులు ,కార్యవర్గ సభ్యులు, ఇతర డిపోల కార్మికులు తదితరులు పాల్గొన్నారు .

# సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**బీఎల్ఓలకు నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం**

**నల్లగొండ, జూలై 15 (తెలంగాణ వాణి):**
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, పెండింగ్‌లో ఉన్న ఓటర్ల మ్యాపింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బీఎల్ఓలను ఆదేశించారు. బుధవారం నాగార్జునసాగర్‌లోని 7, 10, 12 వార్డుల్లో ఇంటింటి సర్ ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బీఎల్ఓలతో ఓటర్ల సంఖ్య, మ్యాపింగ్ పురోగతి, పెండింగ్ వివరాలు తెలుసుకుని, ఇంట్లో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి నమోదు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటి డోర్ నంబర్ నమోదు చేస్తూ మ్యాపింగ్ చేయాలని, అన్‌మ్యాపింగ్ ఓటర్ల వివరాలను ఎపిక్ (EPIC) నంబర్ ఆధారంగా ధృవీకరించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఒక్క వ్యక్తికి ఒక్క ఓటు మాత్రమే ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మరణించిన వారి ఓట్లను మరణ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా తొలగించాలని సూచించారు. వివాహం అనంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, వలస వెళ్లిన ఓటర్ల వివరాలను గుర్తించి సర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పర్యటనలో





మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు, తహసీల్దార్ ఖాసీం, మున్సిపల్ చైర్‌పర్సన్ మానస స్వర్ణ సుమన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవి, ఆర్ఐ సందీప్, బీఎల్ఓలు, అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత అంతిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



**డిండి, జూలై 15 (తెలంగాణ వాణి):**
డిండి మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్తాని అంతిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. అంతిరెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ బలోపేతానికి అంతిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్గొండ జిల్లాలో వికసిత్ భారత్ జిరామజి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

**కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సెక్రెటరీ లాల్ చంద్ మా**

**నల్గొండ జులై 15( తెలంగాణ వాణి ప్రతినిధి )**
నల్లగొండ జిల్లాలో వికసిత్ భారత్ జి రామ్ జి పథకాన్ని సామర్థవంతంగా అమలు చేయడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. మంగళవారం కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే జాయింట్ సెక్రెటరీ లాల్ చంద్ మా, అండర్ సెక్రెటరీ రాజీవ్ రాణా, అసిస్టెంట్ డైరెక్టర్ నీతూ లతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం నల్గొండ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి “వికసిత్ భారత్ జిరాంజీ” పథకంగా మారిన తర్వాత పథకం అమలులో ఇబ్బందులు, సాంకేతిక సమస్యలను అధ్యయనం చేసే నిమిత్తం జిల్లాకు వచ్చింది. ముందుగా జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ను ఈ బృందం కలిసి ఉపాధి హామీ పథకం నుండి వికసిత్ భారత్



జీరాంజి పథకం గా మార్పు చెందిన తర్వాత దేశ వ్యాప్తంగా ఆయా జిల్లాలలో పథకం అమలుపై ముఖ్యంగా ప్రత్యేకించి ట్రాన్సిషన్ సమస్యలను తెలుసుకునేందుకు పర్యటిస్తున్నట్లు తెలిపింది.

## జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో గోవిందారం విద్యార్థి ప్రతిభ

### విద్యార్థిని అభినందించిన జిల్లా విద్యాధికారి



**జగిత్యాల: జూలై 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భీమారం మండలం గోవిందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని చెల్ల నాగమణి ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో మే 26 నుంచి 31 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన సందర్భంగా జిల్లా విద్యాధికారి రాము ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కూడా అభినందించిన జిల్లా విద్యాధికారి, విద్యార్థుల క్రీడా ప్రతిభను మరింత ప్రోత్సహిస్తూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యూ టి ఎస్ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా బేస్‌బాల్ సంఘం అధ్యక్షుడు యాళ్ల అమర్నాథ్ రెడ్డి, జిల్లా బేస్‌బాల్ ప్రధాన కార్యదర్శి కొప్పుల గంగాధర్, గోవిందారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశ్ఫాక్ హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అర్బన్ ప్రాంతాల్లో సర్ ప్రక్రియకు ప్రత్యేక దృష్టి పెట్టాలి

**మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి**

**జగిత్యాల: జులై 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల పట్టణంలోని 3వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి నాయకులు శ్రీ రాములు గంగాధర్, కౌన్సిలర్ ప్రదీప్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్ తో ఫోన్‌లో మాట్లాడారు. జగిత్యాల అర్బన్ ప్రాంతంలో సర్ ప్రక్రియ బలహీనంగా సాగుతోందన్నారు. మోతె రోడ్, సౌరాలవాడ, మొండిగట్ట, గోత్రాల కాలనీ, బుడగజంగాల కాలనీ, గోవిందపల్లి ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతం నుంచి ఉపాధి కోసం వచ్చి ఈ ప్రాంతాల్లో స్థిరపడిన కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, వారు ఉదయం పనులకు వెళ్లి సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే అందుబాటులో ఉంటారని తెలిపారు. అందువల్ల ఆయా ప్రాంతాల్లో పనిచేసే బీఎల్ఓలు సాయంత్రం వేళల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటేనే ఓటర్ల మ్యాపింగ్, నమోదు సమర్థవంతంగా



జరిగే అవకాశం ఉంటుందని సూచించారు. ఇప్పటికే అందరికీ నమోదు ఫారాలు పంపిణీ చేశామని, అవి సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు ఎంత బాధ్యతగా పనిచేస్తున్నారో, రాజకీయ పార్టీగా తాము కూడా అంతే బాధ్యతతో సహకరిస్తున్నామని చెప్పారు. ప్రతి ప్రాంతంలో సర్పంచులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలు, కూడా సర్ ప్రక్రియ విజయవంతానికి కృషి చేస్తున్నారని జీవన్ రెడ్డి తెలిపారు.

## ఇంటింటికీ పచ్చదనం.. మొక్కల పంపిణీకి శ్రీకారం





**కోరుట్ల రూరల్, జూలై 15 (తెలంగాణ వాణి)**
: కోరుట్ల మండలం వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో ఎంపీడీవో వోదెల రామకృష్ణ పాల్గొని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి కుటుంబం కనీసం ఆరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గ్రామస్థులకు సూచించిన ఎంపీడీవో, పచ్చదన పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించినప్పుడే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ద్యాగా గంగాధర్, ఉప సర్పంచ్ పిట్టల రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ రాజేష్, ఎఫ్ఏ సునీత, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మురికి కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలి

**ఇబ్రహీంపట్నం జూలై 15 (తెలంగాణ వాణి విలేకరి)**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలకేంద్రం లోని కోజన్ కొత్తూరు రోడ్ లో గల ప్రైమరీ స్కూల్ వద్ద చాలా కాలంగా ఇబ్బందికరంగ ఉన్నటువంటి మురికి కాలువను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.గణేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా మురికి కాలువ శిథిలావస్థలోకి చేరినందున వెంటనే నూతన మురికి కాల్వ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసుకొని పనులను తొందరగా ప్రారంభించాల్సిందింగా సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్,గ్రామ పంచాయతి కార్యదర్శి రామకృష్ణ,ప్రైమరి స్కూల్ హెడ్ మాస్టర్ కృష్ణ



ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల ఆర్టీసీ డిపోను సందర్శించిన కరీంనగర్ జోన్ ఈడీ పి. సోలమన్



**జగిత్యాల: జూలై 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
టీజీఎస్ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. సోలమన్ బుధవారం జగిత్యాల ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించి, డిపో ఆర్థిక పరిస్థితులను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రయాణికులకు అందించే సౌకర్యాలను విస్తరించేందుకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం డిపో సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఆర్టీసీ సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలు, ఆశయాల సాధనకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. అలాగే సంస్థ అభివృద్ధికి దోహదపడే పంచ సూత్రాలను సమర్థవంతంగా అమలు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యదర్శి యుగంధర్ రెడ్డి, కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) భూపతి రెడ్డి, జగిత్యాల డిపో మేనేజర్ రమేశ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయ సిబ్బంది, జగిత్యాల డిపో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో క్రీడా స్ఫూర్తి పెంపొందేలా పోటీలు నిర్వహించాలి

**ఎస్‌జీఎఫ్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ.. సెప్టెంబర్ తొలి వారంలో జిల్లా స్థాయి పోటీలు: అదనపు కలెక్టర్ నాగేష్**




**మెదక్, జూలై 15 (తెలంగాణ వాణి):**
జిల్లాలో క్రీడా స్ఫూర్తి పెంపొందేలా సెప్టెంబర్ తొలి వారంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నాగేష్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పీడీలు, పీఈటీల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 25లోగా మండల స్థాయి పోటీలను పూర్తి చేసి, అనంతరం జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించాలని ఆదేశించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ వెబ్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ పోర్టల్‌లో క్రీడాకారుల వివరాలు, గతంలో జిల్లా నుంచి ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల సమాచారం, క్రీడా పథకాల వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. నాగరాజు మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయి పోటీల్లో 4,150 మంది పాల్గొనగా, 192 మంది రాష్ట్ర స్థాయికి, 16 మంది జాతీయ స్థాయికి ఎంపికై జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, యువజన క్రీడల అధికారి రమేష్, ఏఎంఓ సుదర్శనమూర్తి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

## జూలై 31లోగా నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయాలి

- నవంబర్ 28న --2027 పరీక్ష
- అర్హులైన ఐదో తరగతి విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**జగిత్యాల:జూలై 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో 2027--28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ 2027 కు జిల్లాలోని అర్హులైన ఐదో తరగతి విద్యార్థులు జూలై 31, 2026లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ కోరారు. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, ఎయిడెడ్, గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 31 చివరి తేదీ కాగా, ప్రవేశ పరీక్ష నవంబర్ 28, 2026న నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి అర్హ విద్యార్థికి పరీక్షపై పూర్తి అవగాహన కల్పించి, అత్యధిక సంఖ్యలో దరఖాస్తులు నమోదయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు అర్హులైన ప్రతి విద్యార్థికి సమాచారం అందించడంతో పాటు, తల్లిదండ్రులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో అవసరమైన సహాయం అందించాలని సూచించారు. అలాగే మండలాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.పంచాయతీ శాఖ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, గ్రామీణ ప్రాంతాల అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.నాణ్యమైన, ఉచిత వసతి విద్యను అందించే జవహర్ నవోదయ విద్యాలయాల్లో చేరేందుకు అర్హులైన విద్యార్థులు జూలై 31లోగా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

## శ్రీనివాస పవర్లూమ్స్ సంఘ పాలకవర్గాన్ని సన్మానించిన పద్మశాలి సంఘ కార్యవర్గం



**రాజపేట జూలై: 15(తెలంగాణ వా ణి విలేకరి)**
మండల కేంద్రమైన రాజపేటలో శ్రీ భక్త మార్కండేయ దేవాలయ కమిటీ ఆవరణలోబుధవారం రోజున శ్రీనివాస పవర్లూమ్ సంఘం పాలకవర్గాన్ని రాజపేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఇటీవల పవర్లూమ్ సొసైటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆడేపు రామకృష్ణయ్య, ఉపాధ్యక్షుడు ఆడేపు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి సకినాల శ్రీనివాసులు, కోశాధికారి పొట్టబతిని నరహరి డైరెక్టర్లు గొట్టిపాముల సాయి కృష్ణ, సకినాల ఉపేందర్, ఆడెపు రమాదేవి, పొట్ట బత్తిని నరేందర్, కర్నాటి వరలక్ష్మిలను పద్మశాలి సంఘం అధ్యక్షులు చిన్న వెంకటరమణ, సన్మానించారు. ఈ సందర్భంగా ఆడేపు రామకృష్ణయ్య మాట్లాడుతూ పవర్లూమ్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, కార్మికులకు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలను ప్రతీ కార్మికునికి అందేలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం డైరెక్టర్లు బల్ల కృష్ణ, గర్దాసు శ్రీశైలం, చుంచు నారాయణ, పొట్టబతిని వెంకటేశం, మరియు ఆడేపు గణేష్, ఎక్కల దేవి లక్ష్మయ్య, ఆడెపు పాండరి, ఆడెపు శేఖర్, సకినాల లక్ష్మీనారాయణ, వెంకటేష్, ఉపేందర్, లక్ష్మణ్, బండ శంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## దళిత సంఘం ఫంక్షన్ హాల్ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నం.. ఎస్ఐకు ఫిర్యాదు

**జగిత్యాల/బుగ్గారం, జూలై 15 (తెలంగాణ వాణి):**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావుపేట గ్రామంలోని బోడగుట్ట పరిధిలో సర్వే నంబర్ 37/2లో ఉన్న సుమారు ఎకరం 20 గుంటల స్థలాన్ని ఫంక్షన్ హాల్ కోసం దళిత సంఘ సభ్యులు వినియోగించుకోవాలని 2020 నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని సంఘం సభ్యులు తెలిపారు.ఈ స్థలాన్ని షేక్ అజీజ్ అనే వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.



ఇప్పటికే రెవెన్యూ అధికారులు స్థలాన్ని సర్వే చేసినప్పటికీ ఆక్రమణ యత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. స్థల వివాదంపై బుధవారం బుగ్గారం ఎస్ఐ జి. సతీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం దళిత సంఘ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, ఫంక్షన్ హాల్ కోసం కేటాయించాలని కోరుతున్న స్థలాన్ని రక్షించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**జగిత్యాల: జూలై 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్జెక్టుల వారీ వృత్త్యంతర శిక్షణా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు.జిల్లా కేంద్రంలోని జ్ఞాన హైస్కూల్‌లో ఆంగ్ల సబ్జెక్టుకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించిన కలెక్టర్, శిక్షణ నిర్వహణ తీరును పరిశీలించారు. రిసోర్స్ పర్సన్ బోధనను తరగతి గదిలో కూర్చొని ప్రత్యక్షంగా వీక్షించి, ముఖ్యంగా కృత్రిమ మేధ ఏ ఐ ని తరగతి గదిలో విద్యార్థుల అభ్యాసానికి ఎలా సమర్థవంతంగా వినియోగించాలనే అంశంపై అందిస్తున్న శిక్షణను ఆసక్తిగా పరిశీలించారు. ఆంగ్ల భాష బోధనలో స్పోకెన్ ఇంగ్లీష్, విద్యార్థి-



కేంద్రిత బోధనా విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, కృత్రిమ మేధ ఆధారిత బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలి: కలెక్టర్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యాలను పెంపొందించడంలో ఆధునిక బోధనా విధానాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి శిక్షణా అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆగస్టు చివరి నాటికి హాస్టల్ నిర్మాణం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆస్పత్రి సేవలపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సమీక్ష

**జగిత్యాల: జూలై 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఆగస్టు చివరి నాటికి మెడికల్ కాలేజీ హాస్టల్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీ, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సునీల్, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, మెడిసిన్ విభాగాధిపతి హెచ్ ఓ డి డాక్టర్. సుభాశ్, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ బదిలీ అవుతున్న నేపథ్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా సుభాశ్ బాధ్యతలు



స్వీకరించనున్నారని వెల్లడించారు. విద్యార్థులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య, విద్యా సేవలు నిరంతరం కొనసాగించాలని ఎమ్మెల్యే సూచించారు. కొత్త విద్యార్థుల బ్యాచ్ రానున్న నేపథ్యంలో మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులతో చర్చించారు. మెడికల్ కాలేజీలో ఆడిటోరియం, అదనపు పరీక్షా హాల్ ఏర్పాటు, విద్యార్థుల రవాణా కోసం కొత్త బస్సుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ఆస్పత్రి భవనం, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా అవసరమైన నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు. అదేవిధంగా, జగిత్యాల పాత బస్టాండ్ ప్రధాన ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, ప్రస్తుతం ఉన్న 17 మంది వైద్యుల్లో నలుగురిని (ఒక యూనిట్) పాత బస్టాండ్ ఆస్పత్రిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే 20 పడకలను మెడిసిన్ విభాగానికి కేటాయించి, వైద్యులకు విధులు కేటాయించాలని, కొత్త బస్టాండ్ సమీపంలోని నూతన ఆస్పత్రిలో అత్యవసర (ఎమర్జెన్సీ) విభాగం నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మెడిసిన్ విభాగాధిపతి డా. సుభాష్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

## ఉద్యమకారుల హామీలు నెరవేర్చకపోతే మరో ఉద్యమం తప్పదు

**రాజపేట జూలై: 15(తెలంగాణ వాణి విలేఖరి)**
తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు పణంగా పెట్టిన ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ మేని ఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.కమిటీల పేరుతో కాలయాపన చేస్తే సహించేది లేదు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ విధివిధానాలను వెంటనే ప్రకటించాలి. చర్చల పేరుతో, కమిటీల పేరుతో కాలయాపన చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఉద్యమకారులు స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని ఉద్యమకారులు మాట్లాడారు . కుర్చీ కోసం కక్కుర్తి పడే వారికి మా ప్రశ్నలే కట్టడి అన్నట్టు - ఓట్ల కోసం హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మర్చిపోవడం తగదని హెచ్చరించారు. ఇప్పటికే కోర్టు ద్వారా వచ్చిన తీర్పును కూడా పక్కకు పెట్టి కోర్టు తీర్పును జాప్యం చేస్తున్నారు. ఉద్యమకారుల కోరికలను ప్రభుత్వమే నెరవేర్చాలని గుర్తు చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని ఉద్యమకారులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరిస్తే ఊరుకునేది లేదని, అట్టి విషయాన్ని ప్రజలు కూడా ఈ విషయాన్ని



గమనిస్తున్నా రణి హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యమకారులకు న్యాయం చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు కూడా ప్రభుత్వం ఉద్యమ కార్లుగా గుర్తించాలని కోరుతూ, వారికి ఉద్యమకారులకు కల్పించే అన్ని వసతులు వారికి కూడా కల్పించాలని రాజపేట మండల తెలంగాణ ఉద్యమకారుల సంఘం మాజీ అధ్యక్షుడు మారాజు కుమారస్వామి, ఉపాధ్యక్షుడు వెంట సత్యనారాయణ లు డిమాండ్ చేశారు.

## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి: నీలం మధు ముదిరాజ్.

**లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన నీలం.**

**పటాన్ చెరు, జూలై 15, (తెలంగాణ వాణి రిపోర్టర్)**
ఆపత్కాలంలో పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక సంజీవనిలా మారిందని, నిరుపేదల ఆరోగ్య భద్రతకు ఈ నిధి ఎంతో భరోసానిస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన అమీన్ పూర్ కు చెందిన అనసుజకు 60,000, గుమ్మడిదల కు చెందిన సీహెచ్ శ్రీనివాస్ 47,500, ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ సంగన్న గారి మహేష్ కు 60,000, ల చొప్పున లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎన్ ఎం ఆర్ క్యాంప్ కార్యాలయంలో స్వయంగా అంద జేశారు.ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, ఆర్థిక స్తోమత లేక కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించు కోలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని కొనియాడారు. సమయానికి వైద్యం అందక, అప్పుల పాలవుతున్న ఎన్నో కుటుంబాలను ప్రభుత్వం ఈ నిధి ద్వారా ఆదుకుంటోందని, నిరుపేదలు అనారోగ్యం బారిన పడినప్పుడు అధైర్యపడకుండా



ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో ఇండస్ట్రియల్ ఫార్మసీఎం.ఫార్మ్. కోర్సులు

**పటాన్ చెరు, జూలై 15, (తెలంగాణ వాణి రిపోర్టర్):**
2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ ఫార్మసీ 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఇండస్ట్రియల్ ఫార్మసీలో ఎం.ఫార్మ్. కోర్సును ప్రారంభించడానికి భారత ఫార్మసీ కౌన్సిల్ (పీసీఐ) ఆమోదించింది. దీనితో పోస్టు గ్రాడ్యుయేట్ విద్య మరింత బలోపేతం కావడంతో పాటు, ఫార్మసీ వృత్తి నిపుణులు కావాలను కునే వారికి అవకాశాలు కూడా విస్తరిస్తున్నాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ మంగళవారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.ఈ చేర్పుతో, స్కూల్ ఆఫ్ ఫార్మసీ నాలుగేళ్ల బి.ఫార్మ్ కోర్సుతో పాటు ఇండస్ట్రియల్ ఫార్మసీ, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, ఫార్మాస్యూటిక్స్ అనే మూడు పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తోందని తెలియజేశారు. ఈ కొత్త కోర్సు, ఫార్మాస్యూటికల్ తయారీ, నాణ్యత హామీ, నియంత్రణ వ్యవహారాలు, పారిశ్రామిక పరిశోధన రంగాలలో విద్యార్థులకు ఉన్నత పరిజ్ఞానం, పరిశ్రమ-ఆధారిత నైపుణ్యాలను అందించేలా రూపొందించామన్నారు.స్కూల్ ఆఫ్ ఫార్మసీ నాణ్యమైన విద్య, పరిశోధన, ఆవిష్కరణల ద్వారా తన విద్యాపరమైన ఖ్యాతిని నిరంతరం బలోపేతం చేసుకుంటోందని తెలిపారు. తన విద్యాపరమైన స్థాయిని మరింత పటిష్ఠం చేస్తూ, ఈ స్కూల్ ఎన్ఐఆర్ఎఫ్ 2025 ర్యాంకింగ్స్ లో ఫార్మసీ విభాగంలో 33వ ర్యాంకును పొందిందన్నారు. ఫార్మసీ ప్రిన్సిపాల్ గా తన నేతృత్వంలో, ఈ స్కూల్ అనేక ముఖ్యమైన మైలురాళ్లను సాధించినట్టు ప్రొఫెసర్ శివకుమార్ తెలియజేశారు. అధ్యాపక బృందం పరిశోధన, ఆవిష్కరణ, ఫార్మసీ విద్యలో వారి నైపుణ్యానికి గాను ప్రతిష్ఠాత్మక అవార్డులు, పేటెంట్లు, జాతీయ, అంతర్జాతీయ గుర్తింపులను కూడా అందుకున్నట్టు ఆయన వివరించారు. ఫార్మసీ స్కూల్ ఔషధ ఆవిష్కరణ, న్యూరోడీజెనరేటివ్, క్యాన్సర్ చికిత్సలు, అధునాతన ఔషధ పంపిణీ వ్యవస్థలు, నానోథెరనోస్టిక్స్, త్రీడీ ప్రింటింగ్, సస్టెయిన్డ్-రిలీజ్ ఫార్ములేషన్స్ వంటి రంగాలలో గణనీయమైన కృషి చేసి, ఒక శక్తివంతమైన పరి శోధనా కేంద్రంగా కూడా ఆవిర్భవించిందన్నారు. అధిక ప్రభావం చూపే జర్నల్స్ లో ఈ స్కూల్ ప్రచురణల రికార్డు నిరంతరం పెరుగుతూ ఉండటం, అత్యాధునిక ఫార్మాస్యూటికల్ పరిశోధన, ప్రపంచ విద్యా నైపుణ్యం పట్ల తమ సంస్థ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ప్రొఫెసర్ శివకుమార్ వివరించారు. ఇండస్ట్రియల్ ఫార్మసీలో ఎం.ఫార్మ్ కోర్సును ప్రవేశపెట్టడం అనేది, ఫార్మాస్యూటికల్ పరిశ్రమ యొక్క మారుతున్న అవసరాలను తీరుస్తూనే, పరిశోధన, ఆవిష్కరణ, ఆరోగ్య సంరక్షణకు దోహదపడే అత్యంత నైపుణ్యం గల ఫార్మసీ నిపుణులను తయారు చేయాలనే గీతం నిబద్ధతను ప్రతిబిం బిస్తుందని అన్నారు. మరిన్ని వివరాల కోసం **https://www.gitam edu/hyderabad/ gitam-school-of-pharmacy“** సందర్శించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**పోక్సో, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశం**



**పటాన్‌చెరు, జూలై 15 (తెలంగాణ వాణి):**
వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం పటాన్‌చెరు డీఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎస్పీ ప్రభాకర్‌తో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్క నాటి, అనంతరం రికార్డులు, పెండింగ్ గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, అత్యాచార, డౌరీ డెత్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రతి కేసులో చట్టపరమైన నిబంధనలు పాటించాలని సూచించారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతం కావడంతో ట్రాఫిక్ నియంత్రణ, ఆస్తి సంబంధిత నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, క్రైమ్ ప్రోన్ ప్రాంతాల్లో బీట్ నిఘా పెంచాలని డీఎస్పీకి సూచించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రోత్సహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, అన్ని రికార్డులు సీసీటీఎన్ఎస్‌లో నమోదు అయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. డీఎస్పీ కార్యాలయ రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును ఎస్పీ అభినందించారు.

## రోడ్డుపై గోవుకు సురక్షిత ప్రసవం.. మానవత్వం చాటుకున్న మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట, జూలై 15 (తెలంగాణ వాణి):**
జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆధ్వర్యంలో, పశు వైద్యాధికారి డా. రాజ్‌కుమార్ పర్యవేక్షణలో రోడ్డుపై ఉన్న గోవుకు సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, యజమానులు పశువులను రోడ్లపై వదిలేయడం వల్ల ప్రమాదాలు, ట్రాఫిక్ అంతరాయం, రోడ్లపైనే ప్రసవాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు మున్సిపాలిటీ, పశుసంవర్ధక శాఖ సమన్వయంతో నాలుగు గోవులకు సురక్షితంగా ప్రసవాలు నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలోని గోవుల యజమానులు ఏడు రోజుల్లోగా తమ పశువులను తీసుకెళ్లి సంరక్షించుకోవాలని, లేనిపక్షంలో మున్సిపల్ చట్టాల ప్రకారం జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోవుల సంక్షేమం, ప్రజల భద్రత కోసం అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

## జమ్మికుంటలో విషాదం..
## రైలు కింద పడి కేబుల్ ఆపరేటర్ మృతి

**జమ్మికుంట, జూలై 15 (తెలంగాణ వాణి):**



జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో బుధవారం రైలు కింద పడి కేబుల్ ఆపరేటర్ దాసరి రామ్మూర్తి గౌడ్ మృతి చెందారు. మృతుడు జమ్మికుంట హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదవశాత్తు జరిగిందా లేదా ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

## సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



**రాజపేట జులై: 15(తెలంగాణ వాణి విలేఖరి)**

సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శంకర్ గౌడ్ రాజాపేట ఎస్.ఐ లింగా రెడ్డి మరియు పోలీస్ సిబ్బంది తో రాజపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు మరియు ప్రజలకు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, అతివేగంగా ప్రయాణించకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించకపోవడం ట్రాఫిక్ సిగ్నల్స్ రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించడం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని ప్రజలకు తెలియజేశారు. ప్రతి వాహనదారుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి, సురక్షితంగా ప్రయాణించి, ఇతరులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని అవగాహన కల్పించాలి.

## జూలై 18న యువ సంగ్రామ సదస్సు.. పటాన్‌చెరు నుంచి 5 వేల మంది హాజరు

**నిరుద్యోగ హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్‌చెరు, జూలై 15 (తెలంగాణ వాణి):**

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో జరిగే బీఆర్‌ఎస్ యువ సంగ్రామ సదస్సుకు పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి 5 వేల మంది యువత హాజరవుతారని తెలిపారు.పటాన్‌చెరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రకటించిన నిరుద్యోగ డిక్లరేషన్‌లోని హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లు గడిచినా అమలు చేయలేదని ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అలాగే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఓటరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గాన్ని ఎస్ఐఆర్ అమలులో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు.

## నా నారుకేం మాయ రోగమో

**ఎన్ని మందులు కొట్టినా మాడుతుంది**

**ధర్మారం జులై 15 (తెలంగాణ వాణి)**



ప్రకృతి వైపరీత్యమో నకిలీ విత్తనాల లోపమో తెలియదు గానీ నారు మాడి పోతుందని, నారువేసేందుకు మడులు దున్ని సిద్ధంగా ఉన్నయి ఈ నారుకేం మాయ పుట్టిందో ఏమో గాని ఎన్ని మందులు కొట్టిన మాడుతూనే ఉన్నదని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేసాడు. వివరాలలోకి వెళితే పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన కొడిపెల్లి మల్లయ్య అనే రైతుకు మల్లాపూర్ గ్రామ శివారులో రెండు ఎకరాల పొలం ఉన్నది. నెల రోజుల క్రితం ఆరు బస్తాలు తీసుకువచ్చి మండే పోసి పొలంలో మొలక చల్లితే నెలలోపల నారు అధిక శాతం మాడిపోతుందని ఆ రైతు కన్నీరు మున్నీరైనాడు. ఎన్ని మందులు చల్లినా ఫలితం అగుపడుతా లేదు సరిపడా నీరు పెట్టినా ఎండుతుంది నాటేసుడా లేదా అనే సందిగ్ధంలో ఆ రైతు ఆందోళన చెందుతున్నాడు. ఇప్పటికే 8 నుండి 10 వేల పెట్టుబడి అయిందని మల్లయ్య ఆవేదన వ్యక్తం చేసాడు. పంటనష్టం జరిగితే ప్రభుత్వం ఆదువాలని వేడుకున్నాడు.

## జూలై 17న కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణ సభ



**వనపర్తి, జూలై 15 (తెలంగాణ వాణి):**

కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో జూలై 17న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణ సభ, అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు రచించిన "దక్షిణ భారతదేశంలో కుల ఆధిపత్యం, ప్రతిఘటన, దళిత అస్తిత్వ రాజకీయాలు" పుస్తకంపై చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు, పలువురు విద్యావేత్తలు, సామాజికవేత్తలు, ఉద్యమకారులు పాల్గొని ప్రసంగించనున్నారు. మేధావులు, విద్యార్థులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సందర్భంగా బుధవారం వనపర్తిలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈరపాగ గోవింద్, సైదమ్మ, గంధం నాగరాజు, కొమ్ము చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ మహిళను దూషించిన వారిని తక్షణమే సస్పెండ్ చేయాలి

**వనపర్తి : జులై 15, ( తెలంగాణ వాణి ప్రతినిధి)**



యాదగిరిగుట్ట దేవాలయ బోర్డు మెంబర్ అయిన బీసీ యాదవ మహిళను అకారణంగా దూషించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలనీ, ఇలాంటి వారికి మంచి బుద్ధి కల్పించాలని, ఇలాంటి వారికి రాజ్యాంగ సూత్రాలు నేర్పించి బుద్ధి కలగజేయాలని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు వినతి పత్రం సమర్పించిన అఖిలపక్ష ఐక్యవేదిక, కుల, ప్రజా సంఘాలు.ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ సతీష్ యాదవ్, కుల ప్రజా సంఘాల నేతలు గంధం నాగరాజు, యాదవ సంఘం జిల్లా నాయకులు సుబ్బయ్య యాదవ్, అవుల శ్రీను, 22వ వార్డ్ కౌన్సిలర్ భర్త మెకానిక్ శ్రీను, టిడిపి నాయకులు కొత్తగొల్ల శంకర్, ఎమ్మార్పీఎస్ పానుగంటి నాగన్న తదితరులు మాట్లాడుతూ జనాభాలో 80 శాతం ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీలకు చిన్న పదవులు వచ్చినా కూడా కొందరు అగ్రవర్ణ నేతలు ఆకలింపు చేసుకోలేక మదమెక్కిన ఆంబోతు వలె విర్రవీగుతూ మహిళ అని కూడా చూడకుండా యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు మెంబర్ అయిన పేద మహిళను అకారణంగా దూషిస్తూ తమ నీచ బుద్ధిని బయట పెట్టుకుంటున్నారని, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయిన శివ చరణ్ రెడ్డి దీనికి కారకుడు వెంటనే కాంగ్రెస్ పార్టీ, అతన్ని పదవి నుండి తప్పించాలని డిమాండ్ చేస్తున్నామని, ఒక తెలంగాణ యూ ట్యూబర్ పవన్ కళ్యాణ్ ను దూషించాడని ఎన్నో కేసులు పెట్టి పక్క రాష్ట్రానికి తీసుకెళ్లారని, మరి ఇక్కడ బోర్డు మెంబర్ మహిళ ని దూషించిన శివ చరణ్ రెడ్డికి తగిన శిక్ష వేయాలని ముక్తకంఠంతో కోరారు. ఇంకోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే తెలంగాణలోని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలంతా ఏకమై తగిన బుద్ధి చెప్తారని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సురేష్ యాదవ్, మంగ దొడ్డి రాములు, శ్రీధర్ గౌడ్, కేశవ్ నాయక్, తిరుపతయ్య, నిరంజన్ గౌడ్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు

## ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గానికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి శుభాకాంక్షలు

**రక్తదాన శిబిరం ప్రారంభించి పదవీ బాధ్యులను సన్మానించారు**

**వనపర్తి, జూలై 15 (తెలంగాణ వాణి):**




వనపర్తి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకార మహోత్సవం స్థానిక దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జిల్లా అధ్యక్షుడు ఇటుకూరి బుచ్చయ్యను సన్మానించారు.అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆయన, ఆర్యవైశ్యులు సామాజికవర్గ అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుండటం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, చిట్యాల రాము, ఆర్యవైశ్య సహాయనిధి చైర్మన్ గట్టు శేషి, మారం బాలీశ్వరయ్య, పూరి సురేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు



## జూలై 17న కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణ సభ

**వనపర్తి, జూలై 15 (తెలంగాణ వాణి):**

కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో జూలై 17న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణ సభ, అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు రచించిన "దక్షిణ భారతదేశంలో కుల ఆధిపత్యం, ప్రతిఘటన, దళిత అస్తిత్వ రాజకీయాలు" పుస్తకంపై చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు, పలువురు విద్యావేత్తలు, సామాజిక వేత్తలు, ఉద్యమకారులు పాల్గొని ప్రసంగించనున్నారు. మేధావులు, విద్యార్థులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం వనపర్తిలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈరపాగ గోవింద్, సైదమ్మ, గంధం నాగరాజు, కొమ్ము చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**ఎల్లారెడ్డి జులై 15 (తెలంగాణ వాణి)**

మండలానికి చెందిన 18 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన పోల్కంపేట్ వార్డు సభ్యులు

**ఎల్లారెడ్డి జులై 15 (తెలంగాణ వాణి)**



నియోజకవర్గ పరిధిలోనీ లింగంపేట్ మండలం పోల్కంపేట్ గ్రామానికి చెందిన బండారి హేమలత వెంక రెడ్డి (3వ వార్డు సభ్యురాలు ), బాసు సాయిలు (7వ వార్డు సభ్యులు ), సాతెల్లి సాయిలు (6వ వార్డు సభ్యులు ) ఎమ్మెల్యే మదన్ మోహన్ గారి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, లింగంపేట్ మండల మరియు పోల్కంపేట్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సోనాలలో కలెక్టర్ విస్తృత పర్యటన



**ఆదిలాబాద్, జూలై 15 (తెలంగాణ వాణి):**

జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం సోనాల మండలంలో పర్యటించి ఎరువుల విక్రయ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ప్రక్రియను పరిశీలించారు. అలాగే నూతన మండల విద్యాశాఖ కార్యాలయం, ప్రీ-ప్రైమరీ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించి వాటి వినియోగాన్ని ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, మందుల నిల్వలను సమీక్షించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఫారాలను తప్పులులేకుండా నింపించి పారదర్శకంగా డిజిటలైజేషన్ పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచించారు. అనంతరం ప్రీ-ప్రైమరీ విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.



# ఎన్యుమరేషన్ ఫామ్‌ల ఆన్ లైన్ వెంటనే పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

**నిర్మల్, జూలై 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం భైంసా పట్టణంలో ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. పంపిణీ చేసిన ఎస్ఐఆర్ ఫాంలు, పూర్తి చేసిన ఆన్ లైన్ ప్రక్రియ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను మొత్తం పూర్తి పారదర్శకంగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం నిర్మల్ పట్టణంలోని 24 వ వార్డులో ఎస్ఐఆర్ తీరును పరిశీలించారు. ఆన్ లైన్ ప్రక్రియకు సంబంధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బిఎల్ఓ యాప్ ను పరిశీలించారు. స్థానిక ఓటర్లతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ఫారములు పూరించి, వెంటనే ఫారములు బిఎల్ఓ లకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, తహసిల్దార్లు శశిభూషణ్, రాజు, ఎంపీడీవో నీరజ్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా ఆచార్య భట్టు రమేష్ బాధ్యతల స్వీకారం

**చిలుకూరు, జూలై 15 (తెలంగాణ వాణి):**



చిలుకూరు మండలం జానకీనగర్ తండాకు చెందిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్, సీనియర్ అధ్యాపకులు ఆచార్య భట్టు రమేష్ తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బుధవారం హైదరాబాద్‌లోని అకాడమీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. మూడు దశాబ్దాలకుపైగా బోధన అనుభవం కలిగిన ఆచార్య రమేష్, తెలుగు విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా సేవలందించడంతో పాటు జానపద, గిరిజన అధ్యయనాల రంగంలో విశేష కృషి చేశారు. ఆయన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, డా. బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య భట్టు రమేష్ మాట్లాడుతూ, తెలుగు భాష అభివృద్ధి, నాణ్యమైన పాఠ్యపుస్తకాల ప్రచురణ, తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన నియామకంపై చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణతో పాటు గ్రామస్తులు, గిరిజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

## బీమాక్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులపై అంతగిరిపల్లె చిట్టి ఉమేశ్వర్ సమీక్ష



**తెల్లాపూర్ జూలై 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

తెల్లాపూర్ ఉస్మాన్ నగర్ లోని బీమాక్ కాలనీలో రోడ్ నెం. 77లో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంతగిరిపల్లె చిట్టి ఉమేశ్వర్ ఈరోజు కాంట్రాక్టర్‌తో సమావేశమయ్యారు. అనంతరం కాలనీ సభ్యులతో కలిసి నిర్మాణం జరగనున్న ప్రాంతాన్ని పరిశీలించి, పనుల పురోగతి, నాణ్యత, తదుపరి కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు అతి త్వరలో ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న అంతగిరిపల్లె చిట్టి ఉమేశ్వర్‌కు కాలనీ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

, రాజేంద్రనగర్ : ప్రజలకు మెరుగైన, నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ, పార్కుల సుందరీకరణ పనుల పురోగతిని ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## కల్లూరు గ్రామంలో వనమహోత్సవం



**కోరుట్ల, జూలై 15 తెలంగాణ వాణి రూరల్)**
మండలంలోని కల్లూర్ గ్రామంలో వనమహోత్సవం లో భాగంగా గ్రామ సర్పంచ్ చిట్నెనీ లత - రమేష్ మొక్కలు పంపిణీ చేసి అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరు ఇంటికి రెండు చొప్పున మొక్కలు నాటి వనమోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగా స్వామి , వార్డు సభ్యులు తర్ర సునీత, రామగిరి శ్రీధర్, చిట్నెనీ శైలజ, సంకే స్రవంతి, గజం గంగాధర్, చిట్నేని జగన్, వనతడుపుల పెద్ది రాజు, మహిళలు గ్రామ అధికారులు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో వృక్షార్పణ

**ఎల్లారెడ్డి, జూలై 15 (తెలంగాణ వాణి):**
"మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం" అనే నినాదంతో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో బుధవారం ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ ఆవరణలో వృక్షార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ గాంధీ, స్కూల్ యాజమాన్యంతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం గోపాలస్వామి ఆలయం, రామాలయం ప్రాంగణాల్లో కూడా మొక్కలు నాటారు కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు తులసీదాస్, వినోద్, రాహుల్, హర్ష, యాదగిరి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## బాసర ఐఐఐటిలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశం



**నిర్మల్, జూలై 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటి) విద్యార్థులు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. బుధవారం ఆయన వర్సిటీని సందర్శించి, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాంపస్‌లో విద్యార్థులకు నిరంతర విద్యుత్, సురక్షిత త్రాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజన సదుపాయాలు కల్పించడంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఏ విద్యార్థీ చదువు మధ్యలో ఆపేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, చదువు పూర్తయిన వెంటనే ఉపాధి అవకాశాలు లభించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వర్సిటీలో అడ్మిషన్ల ప్రక్రియ, విద్యాబోధన తీరుపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యా ప్రమాణాలను పెంచేందుకు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్సిటీ అభివృద్ధి, వసతుల గురించి చైర్మన్‌కు వివరించారు. అనంతరం చైర్మన్ ను, కమిషన్ సభ్యులను అధికారులు సన్మానించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, కుస్రం నీలాదేవి, వైస్ చాన్సలర్ గోవర్ధన్, భైంసా ఏఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ వెంకట రామయ్య, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్ అజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జవ్లా-బి, కోలూర్‌లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల ప్రారంభం

### గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**నిర్మల్/తానూర్, జూలై 15 (తెలంగాణ వాణి):**
నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని జవ్లా-బి, కోలూర్ గ్రామాల్లో నూతన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. జవ్లా-బిలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్ర భవనంతో పాటు ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను గ్రామ స్థాయిలోనే అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తానూర్ మండలానికి కీలకమైన 27 ప్యాకేజీ సాగునీటి పనులు పూర్తైతే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య శాఖ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



# క్యాతనపల్లి కమిషనర్‌గా మురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ

- చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కమిషనర్
- ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేయాలని సూచన




**రామకృష్ణాపూర్, జూలై 15 (తెలంగాణ వాణి):**
క్యాతనపల్లి మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎన్. మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా పదవీ బాధ్యతలను చేపట్టిన అనంతరం కార్యాలయ రికార్డులు, పరిపాలనా వ్యవహారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన కమిషనర్ ఎన్. మురళీకృష్ణ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గతంలో జరిగిన విషయాలను పక్కన పెట్టి ఇకపై క్యాతనపల్లి ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది అందరినీ కలుపుకొని పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. ఎటువంటి రాజకీయ జోక్యానికి తావు లేకుండా అన్ని వార్డులను సమాన దృష్టితో అభివృద్ధి చేయాలని, ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత కల్పిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. అలాగే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాల్లో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. చెన్నూర్ మున్సిపాలిటీకి బదిలీపై వెళ్తున్న మాజీ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి, అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఆయన సేవలను కొనియాడుతూ జ్ఞాపిక అందజేసి భవిష్యత్తు బాధ్యతల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- భవిష్యత్ భూ వివాదాలకు తావులేకుండా స్పష్టమైన నక్షాలు రూపొందించాలి: అదనపు కలెక్టర్ వి.రాములు



**మంచిర్యాల, జూలై 15 (తెలంగాణ వాణి):**
ప్రభుత్వం చేపట్టిన భూముల రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం భీమారం మండలంలోని మద్దికల్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమాన్ని మండల తహసీల్దార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్దికల్ గ్రామంలో మొత్తం 853 సర్వే నంబర్ల పరిధిలో 4,810 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. ముగ్గురు లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఒక సర్వేయర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో సర్వే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. రీ-సర్వే పనులకు రైతులు పూర్తి సహకారం అందిస్తున్నారని పేర్కొన్న ఆయన, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా స్పష్టమైన వివరాలతో నక్షాలు సిద్ధమవుతాయని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి అనంతరం భీమారం మండలంలోని ఆరెపల్లి గ్రామం మరియు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా ఎలాంటి ఆలస్యం లేకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ బియ్యం గడువులోగా సరఫరా చేయాలి. తదనంతరం మండలంలోని అంకుశాపూర్ గ్రామంలోని సమతా అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రభుత్వానికి అందించాల్సిన సెంట్రల్ పూల్ రైస్ (సీఎంఆర్) బియ్యాన్ని నిర్దేశిత గడువులోగా సరఫరా చేయాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోక్సో చట్టంపై అవగాహన సదస్సు



**బోథ్, జూలై 15(తెలంగాణా వాణి ప్రతినిధి)**
ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా మర్లపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ విద్యార్థులకు పోక్సో చట్టం-2012 గురించి వివరిస్తూ ఈ చట్టంలో గల సెక్షన్లు శిక్షల గురించి వివరించారు అదేవిదంగా విద్యార్థులకు సేఫ్ టచ్ అన్ సేఫ్ టచ్ గురించి వివరించారు, విద్యార్థులందరూ మొబైల్ కి సోషల్ మీడియాకి దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ పెంచు కొని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమండ్లు ఉపాధ్యాయులు చంద్రమోహన్, రమేష్, షబ్బీర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాధుల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

-జైపూర్, కుందారం ఆరోగ్య ఉపకేంద్రాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్




**మంచిర్యాల, జూలై 15 (తెలంగాణ వాణి):**
ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు వ్యాధుల నివారణకు గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మిట్టపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని, కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఇందారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవలు, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు, గర్భిణుల నమోదు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. మిట్టపల్లి ఉపకేంద్రంలో స్థానిక సర్పంచ్, జిల్లా క్వాలిటీ అధికారులు, క్వాలిటీ మేనేజర్ రాజ్‌కుమార్, మౌనిక, వైద్యులు, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యులతో సమావేశమై ఉపకేంద్రాన్ని జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఇందారం ఉపకేంద్రంలో స్థానిక సర్పంచ్ ఎండి ఫయాజ్, ఉపసర్పంచ్ శివకుమార్, వైద్య సిబ్బందితో సమావేశమై గర్భిణుల నమోదును 100 శాతం పూర్తి చేయాలని, వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి బుధవారం, శనివారం నిర్వహించే వ్యాక్సినేషన్ కార్యక్రమాలను జిల్లా అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రతి సెషన్‌కు ముందు టీకాలు వేయాల్సిన పిల్లల జాబితాను సిద్ధంగా ఉంచడంతో పాటు అన్ని రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఆశా కార్యకర్తలు ఒక రోజు ముందుగానే తల్లిదండ్రులకు సమాచారం అందించాలని ఆదేశించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రతి రోజు 50 ఇళ్లలో రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించాలని, అసంక్రమణ వ్యాధులు, క్షయవ్యాధి రోగులను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వెంకటసాయి, వైద్యులు, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బాసరలో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం

### భూపూజ, గణపతి పూజలతో పునాది పనుల ప్రారంభం



**నిర్మల్ - బాసర: జూన్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
!శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి బుధవారం వేదోక్తంగా శ్రీకారం చుట్టారు. దేవస్థాన ఈఓ పర్యవేక్షణలో ఆలయ స్థానాచార్యుల ఆధ్వర్యంలో భూపూజ, గణపతి పూజలు నిర్వహించి నిర్మాణ పునాది పనులను ప్రారంభించారు. అనంతరం ఆలయ వైదిక బృందం వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, వేదపండితులు, పరిపాలనా సిబ్బంది, గర్భగుడి నిర్మాణ దాతల కుటుంబ సభ్యులు, సైట్ ఇంజినీర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. నూతన ఆలయ నిర్మాణంతో భక్తులకు విశాలమైన దర్శన సౌకర్యాలు, మెరుగైన ఆధ్యాత్మిక వాతావరణం అందుబాటులోకి రానున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

## విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి శ్రద్ధగా చదువుకోవాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్, జులై : 15 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
విద్యార్థులు సోషల్ మీడియా, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి శ్రద్ధగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచిం చారు. సోనాల మండల కేంద్రంలోని పిఎంశ్రీ జడ్పీ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం పూట రాగి జావ వంటి పౌష్టికాహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినుల్లో రక్తహీనత నివారణకు రాగి జావ ఎంతో దోహదపడుతుందని, జంక్ ఫుడ్స్, చిప్స్ వంటి వాటికి దూరంగా ఉండి విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కమిటీ ఆధ్వర్యంలో ఒక ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.. దీని ద్వారా వచ్చే ఫిర్యాదులను హెచ్ఎంతో కలిసి కమిటీ స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ఏపీజే అబ్దుల్ కలాం, డా. బి.ఆర్. అంబేద్కర్, ఎస్.ఆర్. శంకరన్ వంటి మహనీయుల జీవిత విశేషాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చినట్లు తెలిపారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లను కేవలం చదువు కోసమే ఉపయోగించాలని, రీల్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ క్రీడల్లోనూ రాణించాలని హితవు పలికారు. పాఠశాల అభివృద్ధికి డీఆర్డీఓ సహకారంతో న్యూట్రీ గార్డెన్స్, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, టాయిలెట్ల నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా మండలంలో కొత్త ఎంఆర్ఓ ఆఫీస్ భవన నిర్మాణాన్ని సైతం త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలలో గ్రంథాలయం, న్యూట్రి గార్డెన్లను ప్రారంభించి మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్స్ లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి అధికారులకు తగు చర్యల నిమిత్తం ఆదేశాలకు జారీ చేశారు. కార్యక్రమంలో డిఈఓ మాధవి, డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఏంఆర్ఓ మల్లేష్, ఎంపీడీవో రత్నాకర్ రావు, ఏంఈఓ ఉస్సేన్, సర్పంచ్ బిందుజ, ప్రధానోపాధ్యాయులు సచిన్, విద్యాశాఖ సిబ్బంది అజయ్, విడిసి సభ్యులు తుల శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గాం యువతకు క్రీడా సామగ్రి పంపిణీ

### యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆలకుంట రాజేశం



**పెద్దపల్లి, జూలై 15 (తెలంగాణ వాణి):**
పెద్దపల్లి జిల్లా అంతర్గాం గ్రామ యువతకు యూత్ కాంగ్రెస్ నాయకుడు ఆలకుంట రాజేశం ఆధ్వర్యంలో రెండు వాలీబాల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. యువతలోని క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు దొబ్బల తరుణ్ కుమార్, దండుగుల రఘు కార్తీక్, శ్రీను, లక్ష్మణ్, రాకేష్, రాజేష్ లతో పాటు గ్రామానికి చెందిన పలువురు యువకులు, క్రీడాకారులు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువతకు క్రీడా సామగ్రిని అందజేసినందుకు వారంతా హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

## వికలాంగుల న్యాయమైన హక్కులను అమలు చేయాలి



**లక్షెట్టిపేట, జూలై 15(తెలంగాణ వాణి).**
వికలాంగుల న్యాయమైన హక్కులను ప్రభుత్వం అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ ( ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి ) పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చినటువంటి పెంచిన వికలాంగుల పెన్షన్స్ వెంటనే అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో వికలాంగుల జీవో ప్రకారం 5 శాతం రిజర్వేషన్స్ కల్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బస్, ట్రైన్ పాస్ లను పునరుద్ధరించాలన్నారు. అంతేకాకుండా ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ లు ప్రభుత్వాన్ని తమ వికలాంగుల హక్కుల గురించి, వాటి అమలు గురించి ప్రశ్నించకపోవడం బాధగా ఉందన్నారు. కేవలం ఓట్ల సమయంలో మా వికలాంగులకు ప్రాధాన్యతనిచ్చి ఇప్పుడు విస్మరించడం ఎంతవరకు న్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీలు వికలాంగులను మోసం చేస్తున్నట్లు ఆరోపించారు. నూతన పెన్షన్స్ అందించి మమ్మల్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు మాదిరిగా పెంచిన పెన్షన్స్ ను తెలంగాణలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెరిగిన పెన్షన్స్ వికలాంగులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. వికలాంగుల హక్కులు, న్యాయమైన డిమాండ్స్ నెరవేర్చకపోతే రాబోయే రోజుల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం లక్షెట్టిపేట పట్టణ, మండల నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కులు పోరాట సమితి నాయకులు ముల్కల్ల శ్రీనివాస్, దేవి ప్రకాష్, కోడిజుట్టు రాజేశం, రఘుపతి, రాకేష్, రాజలింగు, రవీందర్, లచ్చన్న, రాజు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి..భావితరాలకు పచ్చని కానుక

**భైంసా రూరల్ పోలీస్ స్టేషన్‌లో వనమహోత్సవం పాల్గొన్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల**





**నిర్మల్ - భైంసా: జూన్ 15 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా ఎస్పీ జి.జానకి షర్మిల అన్నారు. నిర్మల్ జిల్లా భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో పోలీసు అధికారులు సిబ్బంది కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులతో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎస్పీ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు చాక్లెట్లు,అరటిపండ్లు పంపిణీ చేసి అభినందించారు. వనమహోత్సవం సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ "ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి అది చెట్టుగా ఎదిగే వరకు సంరక్షిస్తేనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుంది. నేటి అవసరాలకే కాదు భావితరాల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం కూడా మొక్కల సంరక్షణ అత్యవసరం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్,ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్,రవీంద్ర నాయక్,సాయి కుమార్,దీపక్ ఎస్ఐలు అశోక్, సుప్రియ,జుబేర్,నవనీత్, పోలీసు సిబ్బంది, కేజీబీవి ఉపాధ్యా యులు విద్యార్థినులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు.

## బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లె ప్రశాంత్ నియామకం



**కమలాపూర్ తెలంగాణ వాణి ప్రతినిధి ( జులై 15 )**
హైదరాబాద్ లోని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యలయంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ అధ్యక్షతన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమీటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ అతార్ సింగ్ రావు, విశిష్ట అతిథిగా సెంట్రల్ కోఆర్డినేటర్ సురేష్ ఆర్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అతార్ సింగ్ రావు రాష్ట్ర కమీటీ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లె ప్రశాంత్ ని ప్రకటించారు. ఈ సందర్భంగా అతార్ సింగ్ గారు మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి, యూపీ మాజీ ముఖ్యమంత్రి బెహన్ జీ మాయావతి గారి ఆదేశానుసారం యువతకు పార్టీలో విస్తృత అవకాశాలు కల్పించాలని గుర్తుచేశారు. ఆ క్రమంలోనే గత కొన్ని సంవత్సరాలుగా బీఎస్పీ పార్టీలో అంకితభావంతో పనిచేస్తున్న పల్లె ప్రశాంత్ ప్రత్యేకంగా అభినందించారు. బీఎస్పీ పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఇతర కులాల్లోని పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంవత్సరాలు మాయావతి గారి నాయకత్వం లో పనిచేస్తుందని గుర్తుచేశారు. ఓబీసీ వర్గాలను, యువకులను, విద్యావంతులను పార్టీకి జోడించబంలో పల్లె ప్రశాంత్ కృషి చేయాలని ఉపేదేశించారు. తెలంగాణ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన పల్లె ప్రశాంత్ ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాం కృష్ణ, జోన్ చీఫ్ ఇంచార్జులు దాగిల్ల దయానందరావు, నిషాని రామచంద్రం, బోడపట్ల ఈశ్వర్ లు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జోన్ ఇంచార్జులు, పార్లమెంట్ ఇంచార్జులు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్ మరియు పలు జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# పల్లెల అభివృద్ధినే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి..
- మధిర,ఎర్రుపాలెం మండలాల్లో రూ.60 లక్షల

**నిధులతో నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలు..**





**మధిర జూలై :15 జిల్లా బ్యూరో (తెలంగాణ వాణి):**
– గ్రామాల అభివృద్ధినే లక్ష్యంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకల ఇబ్బందులను శాశ్వతంగా తొలగించే లక్ష్యంతో,మధిర మరియు ఎర్రుపాలెం మండలాల్లో ఎంపీ లాడ్స్ నిధులు రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన మొత్తం 14 సీసీ రోడ్లను ప్రారంభించారు. మధిర మండలం మాటూరు నుంచి ఆరంభమై ఎర్రుపాలెం రేమిడిచర్లలో ముగిసే..మధిర మండలం మాటూరు గ్రామం నుండి ప్రారంభమైన ఈ పర్యటన,ఎర్రుపాలెం మండలంలోని రామన్నపాలెం,ఇనగాలి, తక్కెళ్లపాడు,బనిగండ్లపాడు,మీనవోలు, ఎర్రుపాలెం మండల కేంద్రం మరియు రేమిడిచర్ల గ్రామాల్లో కొనసాగింది. వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల ప్రారంభోత్సవాలకు ఎంపీ శ్రీకారం చుట్టారు. తక్కెళ్ళపాడు గ్రామంలో ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం,ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నానన్నారు. నేడు ప్రారంభించిన ఈ రోడ్లు గ్రామాల్లోని ప్రజల రాకపోకలకు ఇబ్బందులను తొలగిస్తాయని చెప్పారు. ఎంపీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తన పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమాల్లో.. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కోటా రాంబాబు ఐలూరి వెంకటేశ్వరరెడ్డి,మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు,మాజీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి,మండల అధ్యక్షులు పారుపల్లి విజయ్,బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, పి ఎ సి ఎస్ చైర్మన్ కటికల సీతారామిరెడ్డి,యన్నం కోటేశ్వరరావు,అమరవాది సత్యనారాయణ రెడ్డి, మదన్మోహన్ రెడ్డి,అంకిరెడ్డి,సర్పంచులు ముక్కరి రామకృష్ణారెడ్డి,అప్పారావు,నంద్రు అశ్విని,బలుసుపాటి జయరావు,కపిలవాయి సత్యనారాయణ రాజు,సోమా రవికాంత్, తమ్మిశెట్టి బాలకృష్ణ పలువురు కాంగ్రెస్ నాయకులు,ప్రజా ప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు...

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అంజనపురం గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్**

**ఖమ్మం, జూలై 15 (తెలంగాణ వాణి):**
వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల మండలం అంజనపురంలో నూతనంగా నిర్మించిన గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఫ్యాక్టరీ ప్రాంగణం, సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లను





పరిశీలించిన కలెక్టర్, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, బ్యారికేడింగ్, సూచిక బోర్డులు వంటి ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు బహుస్థాయి భద్రతా చర్యలు చేపట్టి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గోద్రేజ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏటూరునాగారం ఐటిడీఏ డీడీగా బాధ్యతలు స్వీకరించిన డి.జనార్ధన్

**ఏటూరునాగారం,జులై14(తెలంగాణ వాణి)**
:తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖలో జరిగిన తాజా పరిపాలనా మార్పుల నేపథ్యంలో ఏటూరునాగారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలో డిప్యూటీ డైరెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా డి. జనార్ధన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న పిరంగికి పదోన్నతి లభించి, ఏటూరునాగారం ఐటిడీఏలో ఖాళీగా ఉన్న డీడీ (టిడబ్ల్యూ) పోస్టుకు నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో గతంలో ఓడీ (డిప్యూటేషన్) ప్రాతిపదికన డీడీ (టిడబ్ల్యూ)గా పనిచేస్తున్న మంచిర్యాల జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ అధికారి డి.జనార్ధన్ నియామక ఉత్తర్వులు రద్దు చేయబడ్డాయి. అనంతరం తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్,హైదరాబాద్ జారీ చేసిన తాజా ఆదేశాల మేరకు డి. జనార్ధన్ ఏటూరునాగారం ఐటిడీఏలో డిప్యూటీ డైరెక్టర్ (ట్రైబల్ వెల్ఫేర్)గా విధుల్లో చేరుతూ,తన జాయినింగ్ రిపోర్టును ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి కు సమర్పించారు. గిరిజన సంక్షేమ శాఖలో పరిపాలనా బలోపేతం,అభివృద్ధి కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేయడంలో ఈ నియామకం దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మాలపాటి సర్పంచ్ అశ్విని-రాజు

**కండువా కప్పి కాంగ్రెస్ లోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే మదన్మోహన్ రావు**



**ఎల్లారెడ్డి నియోజకవర్గం జూలై 15:( తెలంగాణ వాని ప్రతినిధి)**
ఎల్లారెడ్డి నియోజకవర్గం బుధవారం రోజున స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్రావు విస్తృతంగా పర్యటించారు . పర్యటనలో భాగంగా లింగంపేట మండలంలోని మాలపాటి గ్రామ సర్పంచ్ అశ్విని రాజు ఉపసర్పంచ్ సాయిలు పాలకవర్గం మాజీ ఎంపీటీసీ స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు . అనంతరం మాలపాటి సర్పంచ్ మాట్లాడుతూ... నాయకత్వంపై పూర్తి విశ్వాసం ఉందని ఆయన నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తమకు ఆకట్టుకున్న తెలిపారు . గ్రామ అభివృద్ధి ప్రజాసేవ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సర్పంచ్ తెలిపారు . ఎల్లారెడ్డి నియోజకవర్గంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్మోహన్రావు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు . అనంతరం మాచాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. శివ పూర్ లో రూఫ్ టాప్ ప్రైస్ హార్వెస్టింగ్ హిట్ నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రజలందరూ దీనిని ఒక జలయజ్ఞంగా చేపట్టాలన్నారు . వర్షపు నీటి ప్రతి చుక్కను సద్వినియోగం చేసుకోవడం నేటికీ అవసరమని భూగర్భ జలాలు పరిరక్షణకు రైన్ హార్వెస్టింగ్ అత్యంత సమర్థవంతమైన మార్గమని పేర్కొన్నారు . భవిష్యత్తు తరాలకు నీటి కొరత లేకుండా చేయడం మనందరి బాధ్యత. ప్రతి ఇంట్లో రైన్ హార్వెస్టింగ్ హిట్ నిర్మించడం ద్వారా భూగర్భ జలాలు పెంచొచ్చని అలాగే కాపాడవచ్చు అని కొనియాడారు . నీటి సంరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కోరారు . అనంతరం నాగిరెడ్డిపేట మండలంలోని ప్రధాన పోచారం కాల్వ పునరుద్ధరణ కోసం 40 లక్షల నిధులతో పనుల పునరుద్ధరణను స్వయంగా పరిశీలించారు . మాసంపల్లి గ్రామంలో 30 లక్షల వ్యయంతో నిర్మించిన ఫుడ్ గ్రేయిన్ స్టోరేజ్ గోదాం నిర్మాణం కోసం భూమి పూజ చేశారు . వెల్లకుండా తండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో గోదాం మరియు షెడ్ల ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు . అలాగే పటేల్ చెరువు పునరుద్ధరణ పనుల కోసం 42 లక్షల నిధులను మంజూరు చేసి పనుల ప్రారంభం కోసం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు . అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ..... మన నియోజకవర్గానికి కేటాయించిన ఈ నిధులని సక్రమంగా వాడుకోవడం మన బాధ్యత . ఏ అభివృద్ధి పనులైన కాంగ్రెస్ పార్టీకే సాధ్యం . కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అందిస్తున్న పథకాలను అందించబోయే పథకాలను ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి గడపకు అందుతుందని కొనియాడారు . అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు . ఇట్టి కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు , అధికారులు అనధికారులు తదితరులు పాల్గొన్నారు .



## పోచారం ప్రాజెక్టు పూడికతీతకు నిధులు మంజూరు చేయాలి

**ఇరిగేషన్ మంత్రికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వినతిపత్రం**



**నాగిరెడ్డిపేట, జూలై 15 (తెలంగాణ వాణి):**
పోచారం ప్రాజెక్టు పూడికతీతకు నిధులు మంజూరు చేయాలని నాగిరెడ్డిపేట ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టులో చాలా ఏళ్లుగా పూడికతీత చేపట్టకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గిందని, పూడిక తొలగిస్తే నీటి నిల్వ పెరగడంతో పాటు భూగర్భ జలాలు మెరుగుపడి తాగునీరు, సాగునీటి సమస్యలు తగ్గుతాయని ఎమ్మెల్యే వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించి అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. ఈ చర్యపై ప్రాంతీయ ప్రజలు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## తిమ్మాపూర్‌లో భారీగా అక్రమ ఇసుక నిల్వలు గుర్తింపు

**35 ట్రాక్టర్ల ఇసుక సీజ్**



**తిమ్మాపూర్, జూలై 15 (తెలంగాణ వాణి):**
తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన మెరుపు దాడుల్లో భారీగా అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. సీపీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో రెండు ఇసుక డంపులను గుర్తించి, సుమారు 35 ట్రాక్టర్ ట్రిప్పులకు సమానమైన ఇసుకను సీజ్ చేసినట్లు ఏసీపీ సతీష్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను తదుపరి విచారణ కోసం ఎల్‌ఎండీ పోలీసులకు అప్పగించారు. అక్రమ ఇసుక రవాణా, నిల్వలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఏసీపీ హెచ్చరించారు.

## వరి కొనుగోలు కేంద్రాల అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి

**మొహద్‌నగర్ ఘటనపై బీఆర్ఎస్ డిమాండ్**



**నర్సాపూర్/కౌడిపల్లి, జూలై 15 (తెలంగాణ వాణి):**
కౌడిపల్లి మండలం మొహద్‌నగర్ వరి కొనుగోలు కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.
ఈ ఘటన వెనుక వరి కొనుగోలు కేంద్రాల్లో జరిగిన అవకతవకలు, అవినీతిపై అనుమానాలు ఉన్నాయని ఆరోపిస్తూ, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమగ్ర, నిష్పాక్షిక విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.
మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంలో పారదర్శక విచారణ జరపకపోతే రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



## తదుపరి ప్రాజెక్టులపై నాగచైతన్య దృష్టి

అక్కినేని నాగచైతన్య తదుపరి ప్రాజెక్టులపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. అధికారిక ప్రకటన ఏదీ లేకపోయినా, ఆయన కొత్త సినిమాల లైనప్ గురించి ఎంటర్‌టైన్‌మెంట్ పేజీలు, సినీ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో వరుస పోస్టులు దర్శనమివ్వ డంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా ఇద్దరు కొత్త దర్శకులతో చైతన్య సినిమాలు చేయబోతున్నారనే ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వృషకర్మ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న నాగచైతన్య, ఆ తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్‌లో నటించనున్నట్లు ప్రచారం జరిగింది. మసూద చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ చెప్పిన కథను చైతన్య ఇప్పటికే విన్నారని, ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొట్టాయి. కథ నచ్చడంతో కేవలం తుది నిర్ణయం మాత్రమే మిగిలి ఉందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అంతేకాకుండా బెదురులంక దర్శకుడు క్లాక్స్ దర్శకత్వంలోనూ నాగచైతన్య ఓ కొత్త కాన్సెప్ట్ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్తలు కూడా వైరల్ అయ్యాయి. 'వృషకర్మ' షూటింగ్ పూర్తయ్యాక ఈ ఏడాది చివర్లో ఆ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని పలు కథనాలు పేర్కొన్నాయి. వరుసగా ఇద్దరు కొత్త తరహా దర్శకుల పేర్లు వినిపించడంతో అభిమానులు ఈ ప్రాజెక్టులపై ఆసక్తి చూపడం ప్రారంభించారు. అయితే సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి నాగచైతన్య టీమ్ స్పష్టత ఇచ్చింది. మసూద దర్శకుడు సాయి కిరణ్‌తో సినిమా ఖరారైందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని వెల్లడించింది. ఇప్పటివరకు ఇద్దరి మధ్య స్క్రిప్ట్ చర్చలు గానీ, అధికారిక సమావేశాలు గానీ జరగలేదని స్పష్టం చేసినట్లు సమాచారం. అలాగే క్లాక్స్‌తో సినిమా విషయంలో కూడా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కొత్త దర్శకుల నుంచి కథలు వింటున్న మాట నిజమే అయినప్పటికీ, ఏ ప్రాజెక్ట్‌కూ ఇంకా తుది ఆమోదం ఇవ్వలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.



## తుంబాడ్-2 లో ఆలియా భట్

భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్'. ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది' అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపింది. ఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.






# హైటెన్షన్ లైన్ కింద నిర్మాణం కలకలం

### అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు

**కొత్తగూడెం, జూలై 15 (తెలంగాణ వాణి)**

ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద నిర్మాణాలు కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది. విద్యుత్ భద్రతా నిబంధనల ప్రకారం హైటెన్షన్ లైన్లకు నిర్దిష్ట భద్రతా దూరం పాటించాల్సి ఉన్నప్పటికీ, చుంచుపల్లి మండలం విద్యానగర్ పంచాయతీ పరిధిలో వాటిని పట్టించుకోకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై స్థానిక ప్రజలు, నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైటెన్షన్ లైన్ల కింద నిర్మాణాలు పూర్తయితే భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలో విద్యుత్ తీగలు తెగిపోవడం, షార్ట్‌సర్క్యూట్‌లు, విద్యుదాఘాతాలు సంభవించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, స్థానిక ప్రజల భద్రతపై కూడా ఆందోళన వ్యక్తమవుతోంది.

### మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం సాక్షిగా నిబంధనల ఉల్లంఘన

రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయం ఎదురుగా జరుగుతున్న అనుమతి లేని ఈ నిర్మాణం



పట్ల విద్యుత్ శాఖ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఉదాసీనంగా ఉండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో హైటెన్షన్ లైన్ల కింద జరుగుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారా లేదా అన్నది వేచి చూడాలి. అలాగే విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసి, భవిష్యత్తులో ఇలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అంశంలో అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే స్పందించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.





## రావ్ బహద్దూర్ అందరూ చూడాల్సిన మూవీ

### ప్రశంసలు కురిపించిన దర్శకుడు సందీప్ వంగా

ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవలే విడుదలైన 'రావ్ బహదూర్' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకున్నారు. సినిమాను గొప్పగా తీసిన చిత్ర బృందాన్ని అభినందించారు. మనం సినిమాను ఎందుకు అంతగా ప్రేమిస్తామో మరోసారి గుర్తుచేసే అరుదైన చిత్రాల్లో 'రావు బహదూర్' ఒకటి. సినిమా ప్రేమికుడికి నాదొక చిన్న విన్నపం.. మీ జీవితంలోని మూడు గంటల సమయాన్ని 'రావ్ బహదూర్'కు ఇవ్వండి. కచ్చితంగా మీకు నచ్చుతుంది. అన్ని ప్రశంసలు అందుకునేందుకు దీనికి పూర్తి అర్హత ఉంది. వెంకటేశ్ మహా తక్కువ బడ్జెట్‌లో అద్భుతంగా రూపొందించారు. ఎంతో ధైర్యం, తనపై తనకు బలమైన నమ్మకం ఉన్న వాళ్లు మాత్రమే ఇలా తెరకెక్కించగలరు. ఇక సత్యదేవ్ తన నటనతో అదరగొట్టారు. ఇందులో ఎలాంటి అనవసరమైన హడావుడి లేదు, షార్ట్‌కట్‌లు లేవు. కేవలం స్వచ్ఛమైన కథ మాత్రమే కనిపిస్తుంది' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇలాంటి సినిమాలను కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలని అన్నారు.



Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com